శోభాయాత్రకు బయలుదేరిన కోదండరాముడు





శోభాయాత్ర సందర్భంగా భక్తజనంతో కిక్కిరిసిన అప్సరా సర్కిల్

వేడుకగా శోభాయాత్ర

- రామయ్యను చూసేందుకు పోటెత్తిన జనం
- యాత్ర పొడవునా రెట్టించిన ఉత్సాహంతో భక్తజనం
- కడపలో మార్మోగిన జైశ్రీరామ్ నామధేయం
- ఆకట్టుకున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణం

4

అయోధ్యలో బాలరాముడు కొలువుదీరి ఏడాది అయిన సందర్భంగా.. కడప నగరంలో బుధవారం రాములోరి శోభాయాత్ర అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం సీతారాముల కల్యాణం కనులపండువగా సాగింది. అనంతరం కోదండరాముడి భారీ విగ్రహంతో చేపట్టిన శోభాయాత్రతో నగరమంతా జైశ్రీరామ్ నామంతో మారుమోగింది. యాత్ర సాగినంత మేరా భక్తజనసంద్రంగా మారింది.

ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు.. మరో రెండు నెలలు ఫ్రీజ్

- వైసీపీ అక్రమాలు వెలికితీసేందుకే..
- మళ్లీ విచారణకు ప్రభుత్వ ఆదేశం
- జిల్లాలో సగం అక్రమాలే
- అక్రమార్కుల్లో గుబులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తెచ్చిన అసైన్‌మెంట్ భూముల (ఫ్రీహోల్డ్) యాజమాన్య హక్కుల కల్పన చట్టం ద్వారా నిషేధ జాబితా నుంచి తప్పించిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లను మరో రెండు నెలల పాటు నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీకి చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నాయకులు వేల ఎకరాలు పేదల భూములు కాజేశారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఉత్తర్వులు ఇచ్చింది. అనేక లొసుగులతో ఎన్నికలకు ఏడాది ముందు హడావుడిగా జగన్‌రెడ్డి ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చింది. జిల్లాలోనూ ఈ చట్టం దుర్వినియోగం అయిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ చట్టం ద్వారా జిల్లాలో 1.6 లక్షలకు పైగా ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారు. దీని ద్వారా 4500 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నారు. ఇలా జరిగిన రిజిస్ట్రేషన్లలో సగానికి పైగా అక్రమాలు జరిగాయని వాటిని బయటపెట్టేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, కలెక్టర్లకు బాధ్యతను అప్పగిస్తూ ఈ రిజిస్ట్రేషన్లను మరో రెండు నెలల పాటు ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు రేగుతోంది. ఈసారి ఇంకెన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయో..? వేచి చూడాల్సిందే.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అప్పట్లో కేంద్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేదలందరికీ అసైన్డ్ ప్రభుత్వ భూములను పంచిపెట్టింది. అయితే 1956 జూలై కంటే ముందుగా పంపిణీ చేసిన ఈ భూములకు ఎటువంటి నిబంధనలను పెట్టలేదు. దీంతో ఆ భూములు పేదల చేతుల్లో నుంచి పెద్దల పరం అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో 1956 జూలై తర్వాత చేపట్టిన భూపంపిణీకి అనేక నిబంధనలు పెట్టింది. పేదలకు పంచిపెట్టిన ఈ భూములు చాలా సంవత్సరాల పాటు పేదల చేతుల్లోనే ఉన్నాయి. అయితే మారుతున్న కాలం.. రోజురోజుకు పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో ఒకనాటి అసైన్డ్ భూముల్లో వ్యవసాయం కూడా చేయడం లేదు. అదే సమయంలో ఈ భూములు రైతులకు ఉపయోగపడడం లేదు. సేద్యం చేసుకోలేకున్నారు.. అలా అని అమ్ముకోలేకున్నారు.. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఈ అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పన చట్టం (ఫ్రీహోల్డ్) తెచ్చింది. పైకి పేదలకు లబ్ధి చేకూర్చేందుకు ఈ చట్టం తెచ్చినట్లు కనిపించినా లోలోపల కథ వేరే ఉందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చట్టం రూపకల్పనలోనే అనేక లోసుగులు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఈ ఫ్రీహోల్డ్ చట్టంపైన దృష్టి సారించి విచారణ చేపట్టింది.

జిల్లాలో 1.66 లక్షల ఎకరాలు..

జిల్లాలో 1,66,336.06 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇందులో 47,540 ఎకరాలు అర్హత కలిగినవి ఉన్నాయి. 52,473 ఎకరాలు అనర్హులకు చేశారు. ఇంకా 66,322 ఎకరాలు పరిశీలనలో ఉన్నాయి. మదనపల్లె డివిజన్‌లో 62,940 ఎకరాలు ఫ్రీహోల్డ్ జరగ్గా.. అందులో 17,732 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయి. రాయచోటి డివిజన్‌లో 71,741 ఎకరాల్లో 22,725 ఎకరాలు అక్రమమే. రాజంపేట డివిజన్‌లో 31,653 ఎకరాల్లో 12,015 ఎకరాలు అక్రమమని విచారణలో తేలాయి. ఇలా ఫ్రీహోల్డ్ అయిన వాటిలో జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 4525 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరిగిపోయాయి. అందులో 2164 ఎకరాలు మాత్రమే సక్రమంగా ఉండగా.. 2112 ఎకరాలు అక్రమంగా ఉన్నాయి. సక్రమంగా జరిగిన వాటిలో ఎక్కువగా రాయచోటి డివిజన్‌లో 908 ఎకరాలు ఉన్నాయి. రాజంపేట డివిజన్‌లో 757 ఎకరాలు, మదనపల్లె డివిజన్‌లో 498 ఎకరాలు ఉన్నాయి. అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిలో ఎక్కువగా 1089 ఎకరాలు రాయచోటి డివిజన్‌లో, 804 ఎకరాలు రాజంపేట డివిజన్‌లో, 217 ఎకరాలు మదనపల్లె డివిజన్‌లో ఉన్నాయి. జరిగిన రిజిస్ట్రేషన్లలో సగానికి పైగా అక్రమాలే జరగడం విశేషం.

అనుమానాలు పెంచిన మదనపల్లె ఫైల్స్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫ్రీహోల్డ్ వ్యవహారంపైనే అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం దాని సంగతేంటో తేల్చాలని నిర్ణయించి విచారణకు ఆదేశించింది. అప్పటి వరకు జరిగిన ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌లను నిలుపుదల చేసింది. ఈ నేపథ్యంలో గత ఏడాది జూలైలో మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని కీలక ఫైళ్లను కొందరు ఉద్దేశ్యపూర్వకంగా కాల్చేశారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఒకమాటలో చెప్పాలంటే.. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని ఫైళ్ల దహనమే ఫ్రీహోల్డ్‌పై అనుమానాలను పెంచిందని చెప్పవచ్చు. జిల్లాలో దాదాపు ప్రతి గ్రామంలోనూ వైసీపీ నాయకులు ఏదో ఒక రూపంలో ఈ ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకుని పేదల భూములు కారుచౌకగా కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సందర్భంగా జరిగిన విచారణలో ఫ్రీహోల్డ్ వెనకున్న బాగోతాలు, వైసీపీ నాయకుల అక్రమాలు బయటపడ్డాయి.

అక్రమాల అంతు తేల్చేందుకు మళ్లీ విచారణ

కూటమి ప్రభుత్వం మొదటిసారి ఫ్రీహోల్డ్ భూములపై విచారణ జరిపించి ప్రాథమికంగా అక్రమాలను గుర్తించింది. అయితే ఇంకా వెలుగులోకి రావాల్సినవి అనేక అక్రమాలు ఉన్నాయని భావించి మళ్లీ పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని రాష్ట్ర కేబినేట్ నిర్ణయించింది. ఈ విచారణ బాధ్యతను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అప్పగించింది. జిల్లా కలెక్టర్లకు కూడా బాధ్యతను కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు మరోసారి రెండు నెలలు బ్రేక్ పడింది.

ఫైళ్లను వెనక్కి పంపిన అధికారులు

కలెక్టరేట్‌కు గత ప్రభుత్వంలో వచ్చిన ఫ్రీహోల్డ్ భూముల ఫైళ్లను వెనక్కి పంపినట్లు సమాచారం. ఆయా డివిజన్లకు ఈ ఫైళ్లను పంపించినట్లు తెలిసింది. ప్రతి ఫైల్‌ను క్షేత్రస్థాయిలో విచారించి పంపమని ఉన్నతాధికారులు మండల అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఇలా మరొక్కసారి ఫ్రీహోల్డ్ భూములపైన పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని చెప్పవచ్చు.

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయిన ఫైళ్లు (ఫైల్)



లక్ష మంది చిన్నారులకు సంరక్షణ

- ఐసీడీఎస్ పీడీ రమాదేవి

4

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



దిగువ అబ్బవరంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్ గృహ నిర్మాణ లేఅవుట్లలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరంలో గల పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్ నిర్మాణ లేఅవుట్‌లలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఆ లేఅవుట్‌తో పాటు ఏపీ మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లలో సీసీ రోడ్ల నిర్మాణ ప్రగతి, విద్యుత్ పోల్స్, లైన్ల ఏర్పాటు, నీటి వసతి, ఇతర మౌలిక వసతుల కల్పన, ఆర్చి నిర్మాణం తదితరాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు జారీ చేశారు. చేపట్టిన పనులను ఈనెలాఖరులోగా నాణ్యతగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పనుల పూర్తిలో భాగంగా రోజువారీ ప్రగతిని తనకు తెలియజేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అనంతరం ఇళ్ల నిర్మాణం విషయంలో వివిధ అంశాలపై చర్చించి సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి, హౌసింగ్, డ్వామా పీడీలు శివయ్య, వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ సహదేవరెడ్డి, విద్యుత్, హౌసింగ్ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై పోలీసుల దాడి

- కాలు విరిగేలా కొట్టారంటూ విలపించిన బాధితుడు

4

పాడుబడ్డ భవనంలో పడేశారు..

- ఆధార్‌కార్డులు, డ్రైవింగ్ లెసెన్సులు, చెక్‌బుక్‌లన్నీ అక్కడే
- ప్రజలకు పంపిణీ చేయకుండా పడేసిన పోస్ట్‌మన్
- పత్రాలన్నీ ఒకే ప్రాంతానికి చెందినవి



విలువైన పత్రాలు పారవేసిన బోయనపల్లె శివారులోని భవనం ఇదే

రాజంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం కడప-చెన్నై హైవే బోయనపల్లె శివారు ప్రాంతంలోని ఓ పాడుబడ్డ భవనంలో పోస్టాఫీసు సీళ్లు వేసిన నలగని, చిరగని కవర్లు అందులో వందలాది ఆధార్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, బ్యాంకు చెక్‌బుక్కులు, ఎల్‌ఐసీ బాండ్లు, పోస్టాఫీసు పత్రాలు పారవేసిన అంశం రాజంపేటలో ఒక్కసారిగా కలకలం రేపింది. ఒకే ప్రాంతానికి చెందిన ఆధార్‌కార్డులు, చెక్‌బుక్కులు, కనీసం సీల్ కూడా ఓపెన్ చేయకుండా పోస్టాఫీసు పత్రాలు పడి ఉండడం గమనార్హం. ఓ కలర్ ప్రింటర్ అట్టపెట్టె కూ డా అక్కడ కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం జారీ చేసిన ఆధార్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, చెక్‌బుక్కులు, ఎల్‌ఐసీ బాండ్లు సంబంధిత ప్రజలకు చేరవేయకుండా అక్కడే పారవేశారన్న అంశం పై పోస్టాఫీసు అధికారుల నిర్లక్ష్యం పక్కాగా తెలుస్తోందన్న ఆరోపణలున్నాయి. ఆకేపాడు గ్రామాలకు ఒక సబ్‌పోస్టాఫీసు ఉంది. ఇక్కడికి దూర ప్రాంతాల నుంచి వచ్చే ఉత్తరాలు నందలూరు సబ్‌పోస్టాఫీసుకు వచ్చి అక్కడి నుంచి ఆకేపాడు చుట్టుపక్కల ప్రాంతాలకు ఆ పోస్ట్‌మన్ ద్వారా పంపిణీ చేయాల్సి ఉంది. అయితే సంబంధిత పోస్ట్ మన్ నిర్లక్ష్యంతో వాటిని పంపిణీ చేయకుం డా ఓ పెట్టెలో వేసి వాటిని గుట్టుచప్పుడు కాకుండా బోయనపల్లెలోని గ్రామ శివారు ప్రాంతంలోని పాడుబడ్డ భవనంలో పారవేశాడన్న ఆరోపణలున్నాయి. ఆ పోస్ట్‌మన్ వ్యవహారశైలి వివాదాస్పదమని, అతను ఎప్పుడూ పోస్టాఫీసుకు వచ్చే పత్రాలను సక్రమంగా పంపిణీ చేయడని, ఎవరైనా అడిగితే దురుసుగా సమాధానం చెబుతారని ఆకేపాడు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తెలిపారు. ఈ పాడుబడ్డ భవనంలో పత్రాలు పారవేసి ఉండడాన్ని స్థానికులు చూసి మీడియా ప్రతినిధులకు తెలియజేశారు. మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లి పాడుబడ్డ భవనంలో ఉన్న పత్రాలను వీడియోల్లో చిత్రీకరించారు. సంబంధిత పోస్ట్‌మన్‌తో ఫోన్‌లో మాట్లాడగా అతను నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన వెంటనే అక్కడ ఒక్క పత్రాన్ని కూడా ఉంచకుండా తరలించినట్లు తెలిసింది. ఈ విషయంపై నందలూరు పోస్టల్ అధికారి విచారణ చేపట్టినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం కోసం ప్రయత్నించగా సంబంధిత అధికారులు అందుబాటులోకి రాలేదు.



పాడుబడ్డ భవనంలో పడవేసిన ఆధార్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, చెక్‌బుక్కులు తదితర పత్రాలు

చెరువును తవ్వేశారు..

- ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు
- ఎటు చూసినా గుంతలే..



వాల్మీకిపురం మండలంలోని విఠలం చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు



ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

వాల్మీకిపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల వ్యాప్తంగా జాతీయ రహదారి విస్తరణ పనుల పేరుతో పలు ప్రాంతాలలోని చెరువులు నామరూపాలు లేకుండాపోతున్నాయి. రోడ్డు పనుల పేరుతో ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలతో చెరువులు పూర్తిగా గుంతలమయమయ్యాయి. అధికారుల అనుమతులు లేకపోయినా నేషనల్ హైవే పనులకు ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలు కొనసాగిస్తుండటం గమనార్హం. ప్రభుత్వ అనుమతులు సైతం తుంగలో తొక్కుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మండలంలోని విఠలం గ్రామ సమీపంలోని చెరువులో నెల రోజులుగా మట్టి తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. చెరువు పూర్తిగా మట్టి తవ్వకాలతో అగాథాలను తలపిస్తోంది. అనుమతులు లేకపోయినా రోడ్డు పనుల నిమిత్తం మండలంలోని పలు ప్రాంతాలలోని చెరువులలో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారని, ముందు ముందు వ్యవసాయానికి కూడా గడ్డు కాలమే వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎక్స్‌కవేటర్లతో చెరువులను ధ్వంసం చేస్తున్నారని రైతులు సైతం ఫిర్యాదులు చేస్తున్న ఘటనలు లేకపోలేదు. ఒకవేళ మట్టి తవ్వకాలకు అనుమతులు కొద్ది మేరకు మాత్రమే ఉంటాయని, వాటిని అతిక్రమించి చెరువులను ధ్వంసం చేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మట్టి తవ్వకాల విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మట్టి అక్రమ తవ్వకాలపై దృష్టి సారించి తప్పక చర్యలు తీసుకుంటాం. మండలంలోని చెరువు ప్రాంతాలలో ఇకపై మట్టి తవ్వకాలపై దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటాం. గ్రామీణ రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

-పామిలేటి, తహసీల్దార్, వాల్మీకిపురం

వేడుకగా శోభాయాత్ర



- రామయ్యను చూసేందుకు పోటెత్తిన జనం
- యాత్ర పొడవునా రెట్టించిన ఉత్సాహంతో భక్తజనం
- కడపలో మార్మోగిన జైశ్రీరామ్ నామధేయం
- ఆకట్టుకున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణం



కడప నగరంలో జరిగిన శ్రీరాముల శోభాయాత్రలో పాల్గొన్న అశేష భక్తజనం

కడప కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో రాములోరి మహా శోభాయాత్ర అత్యంత వేడుకగా సాగింది. శ్రీరామచంద్రమూర్తి అయోధ్యలో బాల రాముడుగా కొలువుదీరి సరిగ్గా ఏడాది పూర్తి అయిన సందర్భంగా.. ఆయోధ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు నగర మునిసిపల్ మైదానం నుంచి శోభాయాత్ర సాగింది. ఇందులో భాగంగా కోదండరాముడి భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా రూపొందించిన శ్రీరామరథంపై కొలువుదీర్చారు. ఒక చేతిలో బాణం, మరో చేతిలో ధనస్సు చేతబూనిన దివ్య మంగళరూపంతో జగదభిరాముడి శోభాయాత్ర నిర్వహించారు.

అడుగడుగునా భక్తజనం ఉత్సాహంతో అలుపు సొలుపు లేకుండా ముందుకు కదిలారు. శోభాయాత్రలో శ్రీరామచంద్రుడి విగ్రహం చూసేందుకు పుర వీధులు భక్తజనంతో పోటెత్తాయి. మున్సిపల్ మైదానం నుంచి బయలుదేరిన శోభాయాత్ర శంకరాపురం, అప్సరా సర్కిల్, ఎన్జీవో కాలనీ, వై.జంక్షన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్‌సర్కిల్ వద్దకు మధ్యాహ్నం 2 గటలకు చేరుకుంది. అక్కడ భక్తుల కోసం నండే గ్రూప్ సభ్యుల సౌజన్యంతో బి.మఠం ఎంపీటీసీ ముత్యాల రామగోవిందరెడ్డి సారధ్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించి తిరిగి నూతనోత్తేజంతో శోభాయాత్రలో ముందుకు సాగారు. ఎస్పీ బంగళా, రాజారెడ్డి వీధి, కో-ఆపరేటివ్ కాలనీ, అన్నమయ్య సర్కిల్, క్రిష్ణా సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్ గాంధీ విగ్రహం, పాతబస్టాండ్, 7రోడ్స్, ఇందిరమ్మ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, కాగితాలపెంట, ఐటీఐ సర్కిల్, సంధ్యాసర్కిల్, యర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్ పార్క్ మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండరామాలయం వరకూ శోభాయాత్ర సాగింది.

శోభాయాత్ర ఆద్యంతం భక్తులు జై శ్రీరామ్ అంటూ నినదించారు. పిల్లలు, పెద్దలు, యువకులు, వృద్దులు, మహిళలు, యువతులు అనే తేడా లేకుండా రాములోరి శోభాయాత్రలో అడుగులు కలిపారు. శోభాయాత్ర సాగుతున్న ప్రదేశాలలో పలుచోట్ల భక్తులకు దాతలు అన్నప్రసాదాలతో పాటు మంచినీరు, మజ్జిగ ఏర్పాటుచేశారు.



శోభాయాత్రలో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శోభాయాత్రలో రాములోరి విగ్రహం ముందు భాగాన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రధానంగా వరంగల్ నుంచి వచ్చిన తప్పెట మహిళా కళాకారులు లయబద్ధంగా వాయించిన వాయిద్యం అలరించింది. శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లికి చెందిన పానీల శంకర బృందం తప్పెటగుళ్ల కళాకారులు ప్రదర్శించిన నృత్యం భక్తులను కట్టిపడేసింది. అన్నమయ్య జిల్లా సుండుపల్లెకు చెందిన శ్రీనాగారపమ్మ తల్లి చెక్కభజన గురునాథ్ బృందం ప్రదర్శించిన చెక్కభజన రంజింపచేసింది. కడపకు చెందిన కాలేజీ విద్యార్థినిలు ప్రదర్శించిన కోలాటం, రామనామాల తాళం రంజింప చేశాయి.

ప్రత్యేక ఆకర్షణగా స్వాముల వేషధారణలు

శోభాయాత్రలో శ్రీరాముడు, సీతాదేవి, పార్వతి, పరమేశ్వరుడు, హనుమంతుడు, కాళికామాత తదితర దేవతామూర్తుల రూపాలలో గుంటూరుకు చెందిక కొంతమంది కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి రూపాలను తిలకించిన భక్తులు రెండుచేతులెత్తి మొక్కుకున్నారు. మరికొంతమంది వారితో ఫొటోలు దిగారు.



శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా హనుమంతుడు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

శోభాయాత్రకు ముందు ఉదయం 8 గంటలకు మునిసిపల్ మైదానంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై నిర్వహించిన సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు విజయ్‌భట్టర్ సారధ్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అయోధ్య ఐక్యవేదిక ప్రతినిధులు వెంకటరెడ్డి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవి, నగర మేయర్ సురేశ్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కమిషనర్ మనోజ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, నాయకులు ఎం. శ్రీనివాసులురెడ్డి, వై.హరినారాయణరావు, మునగా సతీశ్‌కుమార్, బీజెవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ తదితరులు పాల్గొన్నారు.





కడప నగరంలోని మున్సిపల్ స్టేడియంలో బుధవారం ఉదయం జరిగిన సీతారాముల కల్యాణంలో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు, కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా కేరళ వాయిద్యాలు

లక్ష మంది చిన్నారులకు సంరక్షణ

- ఐసీడీఎస్ పీడీ రమాదేవి



కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ

పీలేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న 2275 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 0-3 ఏళ్ల మధ్య ఉన్న 1.05 లక్షల మంది చిన్నారులను సంరక్షిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాసు, కావలిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అందుతున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు చేరవేసే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. జిల్లాలోని అధిక శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయని, 750 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, 450 కేంద్రాలు ఎలాంటి అద్దె కట్టాల్సిన అవసరం లేని భవనాల్లో ఉన్నాయని తెలిపారు. 'నాడు-నేడు' పథకం ద్వారా 141 భవనాల పనులు జరుగుతున్నాయని ఆమె వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 143 పోస్టుల్లో 116 పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. మిగిలిన పోస్టులు కోర్టు కేసుల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని, మాతృభాషాభివృద్ధిని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రారంభించాలన్న తలంపుతో ప్రభుత్వం ప్రతి కేంద్రానికీ తెలుగు అచ్చు పుస్తకాలు అందజేసిందన్నారు. అనంతరం ఆమె ఆయా కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో రాజమ్మ, సూపర్‌వైజర్లు అక్కాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిర, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు : సీఐ

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైల్వేకోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని రైల్వేకోడూరు సీఐ హేమ సుందరరావు తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బెల్టుతీయరా' అనే శీర్షికన కథనం వచ్చింది. దీనికి స్పందించిన పోలీసులు మద్యం దుకాణాల పరిసర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు పెడతామన్నారు. ప్రతి మద్యం దుకాణం యజమాని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రతి దుకాణం వద్ద బార్ లాగా ఏర్పాటు చేసి తాపిస్తున్నారని దానిపై కూడా దాడులు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై పోలీసుల దాడి

కాలు విరిగేలా కొట్టారంటూ విలపించిన బాధితుడు





పోలీసుల దెబ్బలకు కాలు విరిగిన లారీ డ్రైవర్ నహీద్, డ్రైవర్ చొక్కాపట్టుకుని లాక్కెళుతున్న సీఐ

మదనపల్లెఅర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌కు చెందిన ఎండీ నహిద్ సత్యసాయి జిల్లా కదిరిలో ఓ లారీ యాజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి కదిరి నుంచి తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లోని పేపర్‌మిల్లుకు కలపను లారీలో వేసుకుని రాత్రి 11.45 గంటలకు మదనపల్లె చేరుకున్నాడు. మదనపల్లె తాలుకా పోలీసులు జాతీయ రహదారిలో లారీని ఆపి రికార్డులను చూపమని చెప్పడంతో తెలుగు రాని డ్రైవర్ అర్థం కాక అక్కడే ఉండిపోయాడు. క్యాబిన్‌లోని రికార్డులు వెతుకుతుండగా పోలీసులు విచక్షణారహితంగా కాళ్లపై కొట్టడంతో ఎడమకాలు విరిగి స్పృహ కోల్పోయాడని తోటి డ్రైవర్ చెప్పాడు. కనికరం లేకుండా పోలీసులు మరో రెండు తగిలించండి అంటూ మళ్లీ కొట్టారని నహీద్ అతడు తెలిపాడు. వెనుక వస్తున్న మరో లారీ డ్రైవర్ మహబూబ్‌బాష పోలీసులను ప్రాథేయపడి నహీద్‌కు అండగా నిలిచాడు. బుధవారం ఉదయం లారీ యూనియన్ల నాయకులకు జరిగిన విషయం చెప్పి చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఎడమకాలు విరిగిందని చెప్పారు. ఈ విషయం పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి లారీ యూనియన్ సభ్యులు సిద్ధం అవుతున్న క్రమంలో జిల్లా ఆస్పత్రి వద్దకు తాలుకా సీఐ కళావెంకటరమణ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మరో డ్రైవర్ మహబూబ్‌బాషను చొక్కా పట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. దీంతో లారీ యూనియన్ నాయకులు మదనపల్లె డీఎస్పీకి సీఐపై ఫిర్యాదు చేశారు. ఈ విషయంగా తాలుకా సీఐ కళా వెంకటరమణను వివరణ కోరగా డ్రైవర్లు తమ కానిస్టేబుల్‌ను కాలర్ పట్టుకున్నారని, ఈ విషయం తాను వారికి చెబుతున్నా వినకుండా తనను కూడా లెక్క చేయకుండా వారు మాట్లాడినట్లు తెలిపారు. రూట్‌పై అక్రమ వాహనాలను అరికట్టడానికి మేము ప్రయత్నం చేశామని తెలిపారు. రక్షణ కల్పించే పోలీసులపైనే దాడికి ప్రయత్నించడం తప్పు కాదా అని ప్రశ్నించారు.

అర్జీల పరిష్కారంపై క్షేత్రస్థాయిలో పరిశీలన



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రామాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారం ఎలా జరుగుతుందో తెలుసుకోవడానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామాపురం మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన కొన్ని అర్జీలను పరిశీలించేందుకు బుధవారం ఉదయం రామాపురం మండలాన్ని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారాల గురించి రామాపురం మండల తమసీల్దార్‌కు సూచనలు చేశారు.

త్రీడీ ప్రింటర్లకు ఫ్యూజ్డ్ ఫిలమెంట్

- మిట్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కురబలకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : త్రీడీ ప్రింటర్ల అభివృద్ధి కోసం ఫ్యూజ్డ్ ఫిలమెంట్‌ను విద్యార్థులు తయారుచేశారు. బుధవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలియర్ మెకానికల్ విభాగానికి చెందిన రూపశ్రీ ఒజా పర్యవేక్షణలో విద్యార్థులు ఆదిల్, చైతన్య, వై.దినేష్‌రెడ్డి, జయసూర్య, మహేంద్రాలు ప్లాస్టిక్ సంచులు, వాటర్‌బాటిల్స్‌ను ఉపయోగించి ఫిలమెంట్‌ను తయారు చేశారు.

నిరుపయోగంగా ఉన్న వ్యర్థాలను ఉపయోగించి త్రీడీ ప్రింటర్స్‌కు అనుగుణంగా తక్కువ ఖర్చుతో తయారు చేశారు. త్రీడీ ప్రింటర్స్‌ను కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర వాటిలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. దీని ద్వారా పర్యావరణానికి ఎ టువంటి ఆటంకం లేకుండా దీనిని రూపొందించారు. ప్రాజెక్టును రూపొందిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తీ నాదెళ్ల, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి భాస్కరన్ తదితరులు అభినందించారు.

తాత్కాలిక పనులకే పరిమితమా..?

- గండ్లు పడిన చెరువులు.. కాల్వలను పట్టించుకోని ప్రభుత్వం
- పంటలు ఎలా సాగు చేయాలని ప్రశ్నిస్తున్న రైతులు

పెద్దమండ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో గండ్లు పడిన చెరువు కట్టలు, ఆయకట్టు సాగు కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు, మట్టి పనులకే పరిమితమయ్యాయి. ఐదేళ్లుగా మండలంలో పలు చెరువు కట్టలు, సాగు కాల్వలకు గండ్లు పడడంతో ఆయా చెరువుల ఆయకట్టుదారులు పంటల సాగుకు సుముఖత చూపడం లేదు. ఆయకట్టు భూముల్లో పంట సాగు చేస్తే పంట తుది దశలో చెరువు నీరు పంటకు అందడం కష్టమౌతోందంటున్నారు. గతంలో పంట సాగుతో కోత సమయంలో నీరందక పంటలు ఎండిపోయిన సంఘటనలు ఉన్నాయి.

పెద్దమండ్యం మండలంలో ఈ కోవకు చెందిన చెరువుల సాగు కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆయా ప్రాంతంలో చెరువులు నిండిన రైతులు వరి పంటలు సాగు చేయడం లేదు. చెరువు నీరు పుష్కలంగా ఉన్న తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన సాగు కాల్వలను నమ్ముకుని పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేయడం లేదు. ఐదేళ్లుగా చెరువు సాగు కాల్వలు శాశ్వత పనులు చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దీంతో ప్రస్తుతం మండలంలో పలు చెరువులు నిండినా సాగు కాల్వల దుస్థితితో వరి పంటలు పండించుకోలేకపోతున్నారు.

మండలంలోని పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంటకు వచ్చే వర్షపు నీటి కాల్వకు (పెద్దమండ్యం యల్లమ్మగుడి వద్ద) తాత్కాలిక మరమ్మతులు చేశారు. కలిచెర్ల పాపిరెడ్డి చెరువు గండి పడిన సాగు కాల్వకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. బసిరెడ్డిచెరువు మొరవ కాల్వకు గండిపడడంతో తాత్కాలిక మట్టి వేశారు. ఈ చెరువు నీరు ఎర్రగుట్ట చెరువు, ఉప్పరపల్లి చెరువుకు పోతాయి. తాత్కాలిక మట్టి మరమ్మతు పనులు ఆయకట్టు రైతులే చేపట్టారని పలువురు రైతులు తెలిపారు. వర్షాకాలంలో చెరువులకు వర్షపు నీరు చేరినా రైతుల్లో ఉత్సాహం బదులు నిరుత్సాహం కనిపిస్తోంది. గండి పడిన చెరువులకు మరమ్మతులు చేస్తే ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేస్తామని పలువురు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని మండలంలో గండి పడిన చెరువు కట్టలు, కాలువలకు మరమ్మత్తులు చేయాలని రైతులు కోరారు.



బాటవారిపల్లి సమీపంలో బసిరెడ్డిచెరువు కాల్వకు తాత్కాలికంగా మట్టితో చేసిన మరమ్మతులు

పనులకు ప్రతిపాదనలు పంపించాం

- శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చార్జ్ ఏఈఈ ఇరిగేషన్

మండలంలోని చెరువు కట్టలు, కాలువలు గండిపడిన 11 చెరువులను గుర్తించాం. ఆ చెరువుల అభివృద్ధి పనులకు రూ.6.5 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరైన వెంటనే చెరువుల అభివృద్ధి పనులు చేపడతాం.

బకాయిలను చట్టబద్ధంగా వసూలు చేయాలి

కడప రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిదారులకు రికవరీ, చట్టపర పద్ధతులను వివరించి బకాయిలను వసూలు చేయాలని స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ బి. గుర్రప్ప ఆదేశించారు. డీసీసీబీ కార్యాలయంలో బ్యాంకు సూపర్‌వైజర్లతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, బ్రాంచిల్లో ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా మంజూరు చేసిన రుణాలు, వాయిదా మీరిన బకాయిలను వసూలు చేయాలన్నారు. మొండిబకాయిలు, బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చూపిన బకాయిదారుల స్థిర, చరాస్తుల జప్తు, వేలానికి అత్యవసర చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు అధికారులు నారాయణరాజు, పి.చంద్రశేఖర్, అంజనేయులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రదాత రామసుబ్బన్నకు ఘన నివాళి



రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ సుధీర్

వీరపునాయునిపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర విద్యాసంస్థల విద్యాప్రదాత రామసుబ్బన్న 25వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. సంగమేశ్వర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రామసుబ్బన్న చిత్రపటంతో పాఠశాల నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీగా స్మృతి మండపం వరకు వెళ్లి సమాధి వద్ద నివాళి అర్పించారు. వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, నేతాజీ ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, ఎస్‌వీఆర్ఎస్ఎం బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్, పులివెందుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, విశ్రాంత అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో రక్తదానం

ఒంటిగారి రామసుబ్బన్న వర్ధంతి సందర్భంగా వీరపునాయునిపల్లె వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 107 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాల్లో కంటేగొప్పదని ప్రశంసించారు. సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత ఒంటిగారి వెంకటసుబ్బానాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రామసుబ్బన్న చేసిన విద్యాకృషిని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సుధీర్ రక్తదానం చేసిన 107 మంది విద్యార్థులను అభినందించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం సీడీసీ డీన్ ప్రొఫెసర్ కె.రఘుబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృ, ఎంసీఏ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు, పులివెందుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీఎడ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.వేహనరసింహారెడ్డి, బి.స్రవంతి పాల్గొన్నారు. రక్తదాన శిబిరానికి సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర, విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు ప్రిన్సిపాల్ తెలిపారు. రాత్రి రాక్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సుజన్‌కుమార్‌చే మ్యాజిక్ షో, మెగా ఈవెంట్ డిల్లీ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ట్యాంకర్ ఢీ.. వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలో నాలుగు లైన్ల రహదారిలో ఒక డాబా ఎదురుగా బుధవారం 18 టైర్ల ట్యాంకర్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. డాబా వద్ద నుంచి రోడ్డు దాటుతుండగా ఈ సంఘటన జరిగింది. మృతుని శవం నుజ్జు అవడంతో ఎవరు అనే విషయాన్ని పోలీసులు గుర్తుపట్టలేకపోయారు. ట్యాంకర్‌ను అదుపులోకి తీసుకుని మృతుని వివరాల కోసం ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని సంచిలో కట్టి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కట్నం కోసం వేధింపులు

చాపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన చెట్టూరి అఖిల (23)ను ఆమె భర్త, అత్త కట్నం కోసం వేధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 2022లో అఖిలను ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లెకు చెందిన సుధీర్‌కుమార్‌కు ఇచ్చి వివాహం జరి పించారు. వారికి ఒక కూమార్తె ఉంది. పెళ్లి అయిన మూడు నెలల నుంచి సుధీర్‌కుమార్, ఆయన తల్లి జయమ్మ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పరపల్లెలోని అత్తగారి ఇంటి నుంచి ఆమెను వెళ్లగొట్టారు. ప్రస్తుతం అఖిల పల్లవోలు గ్రామంలోని అమ్మగారి ఇంటిలో ఉంది. అఖిల ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్ ట్యాంకర్‌ను బలవంతంగా తీసుకెళ్లారు

దువ్వూరు, జనవ రి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న తన ఆయిల్ ట్యాంకర్‌ను బలవంతంగా తీసుకెళ్లారని చాపాడు మండలం నరహరిపురం గ్రామానికి చెందిన రామాంజినేయులరెడ్డి దువ్వూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరులో ఆయిల్ వ్యాపారం చేస్తున్న రామాంజినేయులరెడ్డి తన ఆయిల్ ట్యాంకర్ ప్రొద్దుటూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా దువ్వూరు సమీపంలో మధుసూదన్‌రెడ్డి, చల్లా ఆది రాజారెడ్డి మరి కొంత మంది కారులో వచ్చి అడ్డగించారు. మీ యజమాని మాకు డబ్బులు ఇవ్వాలంటూ డ్రైవర్‌ను కిందకు దింపి బలవంతంగా ట్యాంకర్‌ను తీసకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి చెందిన ఆంజనేయులు(35) గుర్తుతెలియని రైలుకింద పడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న మృతుడు తాగుడుకు అలవాటు పడి ఇంటికి రాకుండా తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. అయితే భార్యా పిల్లలతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు, ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసుకుని మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

సీఎం హామీలు అమలు

- పారిశుధ్య కార్మికులకు రూ.లక్ష నగదు బహుమతి అందజేసిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్/మైదుకూరు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరు పర్యట నలో భాగంగా ఇచ్చిన హామీలు అమలవుతు న్నాయి. పారిశుధ్య కార్మికుల కృషిని గౌర విస్తూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ముగ్గురు పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయిల నగదు బహుమతిని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తన చాంబరులో బుధవారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మైదుకూరు పారిశుధ్య కార్మికులు పి.అమ్ములమ్మ, జి.చెన్నమ్మ, యం.యుగంధర్ విలు వలు పాటిస్తూ విధుల పట్ల అంకిత భావంతో సమాజ శ్రేయస్సుకు ఎంతో విలువైన సేవలందిస్తున్నారు. రోజూ ఉదయం 5-30 గంటలకే విధులకు హాజరై మైదుకూరు రోడ్లు, టౌన్, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతున్నారన్నారు వీరి కృషి, పట్టుదలను గుర్తించిన ముఖ్యమంత్రి ఈనెల 18న మైదుకూరు సభలో ఒక్కొక్కరికి లక్ష రూపా యిల చొప్పున ముగ్గురికి మూడు లక్షల నగదు బహుమతిని ప్రకటించారన్నారు. సీఎం ఇచ్చిన హామీని అమలు చేస్తూ కలెక్టర్ ముగ్గురు పారిశుధ్య కార్మికులకు రూ.3 లక్షల నగదును చెక్కు రూపంలో అందించారు. తమ సేవలను గుర్తించి నగదు బహుమతి ప్రకటన చేసిన ముఖ్యమంత్రికి పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, మైదుకూరు మున్సిపల్ కమిషనరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, జేసీ చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న అమ్ములమ్మ, చెన్నమ్మ, గంగాధర్

పాటల పోటీల్లో అంధ విద్యార్థినికి ప్రథమ బహుమతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం స్కౌట్ హాల్లో గణతంత్ర దినోత్సవం పురస్క రించుకొని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో కడప నగరం శంకరాపురం ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థిని నజియా తబుసం దేశభక్తి పాటల పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ విద్యార్థినికి కడప ఉప విద్యాధికారి రాజ గోపాల్‌రెడ్డి బహుమతి అందజేశారు. స్కౌట్ జిల్లా కార్యదర్శి ప్రమీల ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబినేజర్ పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న నజియా తబుసం

ప్రభుత్వ ఉత్తర్వు 117కు ప్రత్యామ్నాయాలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వు 117కు ప్రత్యామ్నాయాలను వివరిస్తూ ప్రత్యేక డాక్యుమెంట్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు సంఘం తరపున సమర్పించినట్లు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి.. ఆ తర్వాత జీఓ 117ను రద్దు పరచాలి.. కొత్త నిబంధనల ప్రకారం స్టాఫ్ ప్యాట్రన్ లెక్కించాలని తదితర విషయాలపై వివరించినట్లు తెలిపారు.

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల యజమానులు వ్యవసాయ శాఖ నియమ నిబంధనలను అనుసరించి వ్యాపారలావాదేవీలు కొనసాగించాలని, లేనిపక్షంలో లైసెన్సు రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న మహాలక్ష్మి, కేవీఎస్ఆర్ ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ పి.సురేష్‌రెడ్డి, ఏవో ఎస్.శివశంకర్‌రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని రికార్డులను, బిల్లుబుక్కులను, స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అమ్మిన ప్రతి బస్తాకు నగదు బిల్లు రైతులకు ఇవ్వాలని తెలిపారు. ఎరువుల బస్తాల్లో, తూకాల్లో ఏవైనా అవకతవకలు ఉంటే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ప్రతి డీలరు లైసెన్సు కలిగి ఉండి గోడౌన్ అనుమతి ఉండాలని ఎరువుల ధరను రైతులకు కనిపించేలా నోటీసు బోర్డులో రాసి పెట్టాలని సూచించారు.



ఎరువుల బస్తాల స్టాకును పరిశీలిస్తున్న ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏవో శివశంకర్‌రెడ్డి

పైలెట్ ప్రాజెక్టు గ్రామాన్ని సందర్శించిన జేసీ

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో బుధవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పర్యటించారు. మొదట మండల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారంపై తహసీల్దారు ద్వారా ఆరా తీసి.. కొన్ని సూచనలు చేశారు. అనంతరం పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపికైన ఇడమడకకు ఆర్డీవో సాయిశ్రీతోపాటు స్థానిక అధికారులతో కలిసి వెళ్లారు. అక్కడ భూ సంబంధ సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేకు సంబంధించి కొన్ని సూచనలు ఇచ్చారు. తహసీల్దారు అక్బల్‌బాష, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఇడమడకలో రీ సర్వే గురించి ఆరా తీస్తున్న జేసీ

మంత్రి లోకేశ్ చొరవతో..... కడపకు చేరుకున్న మృతదేహం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి

కడప క్రైం, జనవరి 22. (ఆంధ్రజ్యోతి) : కడపకు చెందిన షేక్ మహ్మద్ అనీస్ అన్సారీ జీవనోపాధి కోసం మస్కట్ వెళ్లి అక్కడ గుండెపోటు రావడంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులు సోషల్ మీడియా ద్వారా మంత్రి లోకేశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన స్పందించారు. మంత్రి చొరవతో మృతదేహాన్ని కడపకు రప్పించారు. దీంతో కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలియపరిచారు. మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు జరిపారు. విషయం తెలుసుకున్న జిల్లా టీడీపి అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వాసు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

'నిబంధనల మేరకే ములాఖత్‌లు'

కడప క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభ విస్తున్న, రిమాండ్ ఖైదీలకు నిబంధనల మేరకే ములాఖత్‌లు అవకాశం ఇస్తున్న ట్లు డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్ బుధవారకం ఒక ప్రకనటలో వివరించారు. ఖైదీలకు అల్పాహార సౌలభ్యం కూడా నిబంధనల ప్రకారం ఇస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖైదీలకు వసతి కల్పిస్తామని తెలిపారు.

స్కూటరు - లారీ ఢీ.. ఇరువురు దుర్మరణం



కడప క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సెంట్రల్ జైలు వద్ద బుధవారం రాత్రి స్కూటరును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల మేరకు.. కడప నగరం రామాంజ నేయపురంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పడిగ ప్రవీణ్ (27) అతని బంధువు వి.సుభాష్ (23) పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో టౌనుకు వెళ్లి తిరిగి వస్తుండగా కడప సెంట్రల్ జైలు వద్దకు రాగానే తిరుపతి నుంచి కర్నూలు వైపు వెళుతున్న ఓ లారీ వేగంగా వచ్చి స్కూటరును ఢీకొంది. ఈ ప్రమా దంలో ఇరువురు మృతి చెందారు. విషయం తెలుసుకున్న రిమ్స్ పోలీసులు సంఘ టనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మార్చు రీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూలు సమీప వీధిలో మంగళవారం అర్ధరాత్రి గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో 30 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల యజమాని టి.ఓబులేసు లబోదిమంటూ విలపిస్తున్నారు. బాధితుడి వివరాల మేరకు... చలికాలం కావడంతో టి.ఓబులేసు కుటుంబీకులతో కలసి ఇంటిలో నిద్రిస్తున్నారు. ఆరుబయట పాకలో గొర్రెలు ఉన్నాయి. కుక్కలు గుంపులుగా వచ్చి పాకలోని మూగజీవాలపై దాడి చేసి ఇష్టమొచ్చినట్లు వాటిని కొరికి చంపాయి. శబ్ధాలు వినిపించడంతో గొర్రెల యజమాని నిద్రలేచి వచ్చి చూశాడు. సంఘటన గమనించి కేకలు వేవేయగా.. కుక్కలు పారిపోయాయి. అయితే అప్పటికే 30 గొర్రెలను కొరికి చంపేశాయి. మరో 10 గొర్రెలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి. బుధవారం ఉదయం పశువైద్యశాఖ అధికారులు వచ్చి పరిశీ లించి... గాయపడిన గొర్రెలకు చికిత్స చేశారు. గొర్రె ల మృతితో రూ.4లక్షలు నష్టం వాటిల్లిందని.. ప్రభు త్వం ఆదుకోవాలని బాధితుడు ఓబులేసు కోరుతు న్నాడు. కాగా, గ్రామ పంచాయతీ కుక్కల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో ఈ ప్రాంతంలో కొత్త కుక్కలు వదిలి వెళ్లారని, అవి దాడులకు పాల్పడుతున్నాయని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల బెడద సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

మధ్యాహ్న భోజనం నాణ్యతపై తనిఖీ



స్టోర్ రూములో తనిఖీ చేస్తున్న అధికారులు

సిద్దవటం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనం నాణ్యతపై మండలంలోని బాకరాపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్ ఆర్‌వీ రమణ మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ ఆదేశాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని మధ్యాహ్న భోజనం నాణ్యత, స్టోర్ రూము రికార్డులు పరిశీలించామన్నారు. మండలంలో 10 రోజులపాటు ఈ తనిఖీలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాతి నక్షత్రం సందర్భంగా అభిషేకం

చిన్నమండెం, జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లె మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. .

నేడు రక్తదాన శిబిరం

రైల్వేకోడూరు, జనవరి 22:(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని బయనపల్లెలో ఎన్టీఆర్ మోమోరియల్ బ్లడ్ బ్యాంకు ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ యువ నాయకుడు కళ్యాణ్‌రాం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓబనపల్లె, బయనపల్లె ప్రాంతాలకు చెందిన యువకులు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలో నిర్వహించనున్న వేడుకల్లో రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాదు రెడ్డి, ఆయన సోదరుడు మండిపల్లె లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి హాజరవుతారని ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్‌మోహన్ తెలి పారు .

25న తలనీలాల సేకరణ హక్కుల వేలం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర సందర్భంగా ఫిబ్రవరి 28, మార్చి 1, 2 తేదీల్లో గంగమ్మజాతర రోజున తలనీలాలు సేకరించు హక్కులు, ప్రతి ఆదివారం అంగళ్లు, టోల్‌గేట్, కొబ్బరి కాయలు, పూజ సామగ్రి విక్రయించు హక్కు, షామియానా, సప్లయర్స్‌కు ఈ నెల 25న గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు శనివారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. తలనీలాలకు రూ. 50,000, వారం టోల్‌గేట్, టెంకాయలు, పూజాసామగ్రి, షామియానాలకు రూ. 30, 000 డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవికి పెరుగుతున్న పోటీ

- జిల్లాలో రైల్వే కోడూరు మాత్రమే పెండింగ్
- ఆశావహుల్లో పలు సామాజిక వర్గాల నాయకులు
- ఎటూ తేల్చుకోలేని ప్రజా ప్రతినిధులు

రైల్వేకోడూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో .కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 7 నెలలు కావస్తున్నా రైల్వే కోడూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు మాత్రం ఇప్పటికీ పాలకవర్గం ఏర్పాటు కాలేదు. జిల్లా అన్ని మార్కెట్ యార్డులకు పాలకవర్గాలు ఏర్పాటైనా, ఇప్పటిదాకా రైల్వేకోడూరుకు సంబంధించిన ప్రతిపాదనలు మార్కెట్ కమిటీకి వెళ్లలేదని తెలిసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి క్షత్రియులు, బలిజలు, రెడ్లు, కమ్మ, యాదవులు, దళిత వర్గాలకు చెందిన సుమారు పది మంది పోటీలో ఉన్నట్లు తెలిసింది. గతంలో ఈ పదవిని క్షత్రియులకు, ఆ తర్వాత రెడ్డి, యాదవ తదితర వర్గాలకు కేటాయించారు. ఈసారి ఆ పదవిని తమకే కేటాయించాలని నియోజకవర్గంలో ప్రధాన పాత్ర పోషించే బలిజ సామాజికవర్గానికి చెందిన నాయకులు పట్టుబడుతున్నారు. ఆది నుంచి ఈ పదవిని తమకే ఇస్తున్నారని, ఈ సారి కూడా తమకే ఇవ్వాలని క్షత్రియ సామాజిక వర్గానికి చెందినవారు నాయకులపై వత్తిడి చేస్తున్నారు. మిగిలిన వర్గాలు కూడా ఇలాగే వత్తిడి తెస్తుండడంతో నాయకులు తల పట్టుకుంటున్నారు. సంక్రాంతి తర్వాత మిగిలిన నామినేటెడ్ పదవులన్నీ భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆశావహుల సంఖ్య పెరిగిపోతోంది.



రైల్వేకోడూరు మార్కెట్ యార్డు ముఖద్వారం

భుజంగేశ్వరాలయ కమిటీ కూడా పెండింగ్

పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవి కూడా పెండింగ్‌లో పడిపోయింది. ఇందుకు కూడా ప్రతిపాదనలు పంపలేదని తెలిసింది. ఈ కమిటీ చైర్మన్ పదవిని బలిజ సామాజిక వర్గాలకే కేటాయిస్తుండగా, గతంలో ఒక సారి రెడ్డి సామాజికవర్గానికి కట్టబెట్టారు. ప్రస్తుతం బలిజలకే ఈ పదవి ఇవ్వాలని పోటీ పడుతున్నారు.

డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి : కలెక్టర్

రామాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ల్యాబ్‌ను ఉపయోగించుకొని డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యార్థులకు సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఐసీఐసీఐ బ్యాంకు ఆర్థిక సహకారంతో రామాపురం మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్, ఆస్ట్రానమీ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మనం కృత్రిమ మేధతో పోటీపడే ప్రపం చంలో ఉన్నామని, అందువల్ల డిజిటల్ నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. తాను చదువుకునేటప్పుడు ఇలాంటి అవకాశాలు లేవని, ఇప్పటి విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సరిగ్గా ఉపయోగించుకుంటే గొప్ప స్థాయికి వెళ్లవచ్చునని సూచించారు. కంప్యూటర్‌ను, మొబైల్ ఫోన్లను మంచి విషయాలకు, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి ఐసీఐసీఐ బ్యాంకు రాయచోటి శాఖ మేనేజర్ ఏసుదాసు, ఆగస్టే పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, ఎంఈవోలు రామకృష్ణుడు, జయచంద్రుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

పశు సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సుండుపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పశువుల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటరావు, అన్నమయ్య జిల్లా పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరుమూల గ్రామాల్లో పశు పోషణతో ఎంతో మంది జీవిస్తున్నారన్న ఉద్దేశంతో ప్రభుత్వం పశు సంరక్షణకు పెద్దపీట వేసిందని తెలియజేశారు. పాడి రైతులు ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమన్నారు. చెరుకువాండ్లపల్లె, బూడిదేటివాండ్లపల్లెలో పశువైద్య శిబిరాలను స్థానిక రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం 97 పశువులకు ప్రథమ చికిత్స నిర్వహించారు. 215 గొర్రెలకు పారుడు వ్యాధికి వ్యాక్సిన్ వేశారు. ఆరు పశువులకు గర్భకోశ చికిత్సలు, 4 పశువులకు కృత్రిమ గర్భధారణ, 5 పశువులకు చూలు పరీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య, రాయచోటి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లోకేశ్, పశువైద్యాధికారులు విజయ్‌కుమార్, డాక్టర్ రవికుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, గోపాలమిత్ర సిబ్బంది పాల్గొన్నారు.



పశువులకు వైద్యం చేస్తున్న అనిమల్ హజ్బెండరీ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రావు

వేడుకగా హైందవ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న పట్టణ ప్రజలు

రాజంపేట టౌన్, జనవరి 22 (ఆంధ్ర జ్యోతి): అయోధ్యలో బాలరాముడిని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సంద ర్భంగా బుధవారం రాజంపేట పట్ట ణంలో జైశ్రీరాం నినాదాల నడుమశోభా యాత్ర నిర్వహించారు. పట్టణంలోని మన్నూరు ఎల్లమ్మ గుడి నుంచి మెయిన్‌రోడ్, ఆర్ఎస్ రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, శ్రీరాముల గుడి రకు పెద్ద సంఖ్యలో బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని రెడ్డీస్‌కాలనీలో ఉన్న రామాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం నిర్వహించారు. అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని ప్రజలు ఆలయాలతో పాటు, ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


రాయచోటిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తుండడంతో పట్టణంలో భూకబ్జాలకు అంతులేకుండా పోయిందని సీపీఐ(ఎంఎల్) లిబ రేషన్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఓబయ్య, అన్నమయ్య జిల్లా నా యకులు మావులూరి విశ్వనాథ్, సిగి చెన్నయ్య విమర్శించారు. బుధవారం వారు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంత మంది వ్యక్తులు డీకేటీ భూములను కబ్జా చేసి వెంచర్లు వేస్తున్నారన్నారు. ఈ వియం తెలిసినా రెవెన్యూ అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనేకసార్లు ఫిర్యాదు చేసి నా స్పందించిన పాపాన పోలేదన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కబ్జాదారులతోపాటు, వారికి సహకరిస్తున్న అధి కారులపైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దాం'

గాలివీడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దామని ఎంపీహెచ్‌వో శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సరస్వతి విద్యానికేతన్‌లో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు, నొప్పి లేని బుడిపెలు వంటి లక్షణాలు కనిపిస్తే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. వ్యాధిని బట్టి ఉచితంగా మందులు పంపిణీ చేస్తా రన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి

సుండుపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మల్బరీ సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునని మల్బరీ శాస్త్రవేత్త తిరుపతయ్య, ఏడీ రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం మండలంలోని మడితాటు గ్రామ పంచాయతీ కొండ్రెడ్డిగారిపల్లెలో కేంద్ర పట్టు మండలి, పట్టు పరిశ్రమశాఖ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్బరీ సాగు చేసి ఎంతో మంది రైతులు ఆర్థికాభివృద్ధి సాధించారన్నారు ఎంతో మంది విద్యావంతులు సిరికల్చర్ వైపు మొగ్గు చూపుతూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారని, మండలంలో కూడా ఎక్కువ మంది సిరికల్చర్ సాగులో భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నారన్నారు. పట్టుసాగు చేసేందుకు ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం రాయితీతో షెడ్లు నిర్మిస్తోందన్నారు. ఇతరులకు 75 శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. టైప్-1 షెడ్లకు రూ.4,50,000 ప్రభుత్వం మంజూరు చేస్తుందని, అందులో ఎస్సీ, ఎస్టీలకు రూ.4,05,000లు, ఇతరులకు రూ.3,37,500 సబ్సిడీ ఇస్తుందన్నారు. ఎకరా సాగు చేస్తే ఎస్సీ, ఎస్టీలకు రూ.27 వేలు, ఇతరులకు రూ.22,700 ప్రభుత్వం ఇస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్క నాటిన 45 రోజుల తర్వాత కేంద్ర ప్రభుత్వం నగదును రైతు అకౌంట్‌లోకి జమ చేస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త తిరుపతయ్య

ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయరెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ శాస్త్రవేత్తలు రష్మీ, చైత్ర, ఏఎస్‌వో సుబ్బరాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ రెడ్డినాయక్, సర్వశిక్ష అభియాన్ రిటైర్డ్ పీడీ రమేశ్ కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరి

● జేడీఏ చంద్రానాయక్

సుండుపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బంది దగ్గర ఈ పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేయించాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్ తెలిపారు. బుధవారం సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రం పరిధిలోని పెద్దమాదిగపల్లెలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఈ పంట నమోదు, ఈకేవైసీతో ప్రయోజనా లను తెలియజేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని కోరారు. పంటల్లో ఆశించే చీడపీడలు తెగుళ్ల యొక్క ఉధృతిని ఎన్‌పీఎస్ఎస్ అనే యాప్ ద్వారా తెలుసుకొని నివారణ చర్యలు తీసుకోవచ్చని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎన్‌పీఎస్ఎస్ యాప్ పనితీరును కూడా పరిశీలించడంతోపాటు, రబీ సీజన్‌లో ఉలవ పైరు సూపర్ చక్రి కార్డును కూడా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, వ్యవసాయ సిబ్బంది వెంకటమోహన్, ముకుంద, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాలు నడిపితే చర్యలు

చిన్నమండెం, జనవరి22(ఆంధ్రజ్యోతి): రికార్డులు లేని వాహనాలు నడిపితే చర్యలు తప్పవని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ సుధాకర్ వాహనదారులను హెచ్చరించారు. కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై తూర్పుపల్లె క్రాస్ వద్ద బుధవారం సీఐ వరప్రసాద్, కేశాపురం చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ సుధాకర్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. నెమ్మదిగా ప్రయాణించడం ద్వారా క్షేమంగా గమ్యం చేరుకుంటారని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా రెడ్డివారిపల్లె వంతెన పనులు



వంతెన పనులను పరిశీలిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లె బ్రిడ్జి పనులను బుధవారం రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ జి. చంద్రశేఖర్, ఈఈ సహదేవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డివారిపల్లె బ్రిడ్జి పనులు ముమ్మరమయ్యాయన్నారు. ప్రస్తుతం బ్రిడ్జికి ఇరువైపులా గోడల పనులు చేస్తున్నారని తెలిపారు. ఇక రోడ్ల పనులు సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ పాములపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇంత వరకు ఒక్క బిల్లు కూడా చేయకపోవడంతో అప్పులు చేసి పనులు చేస్తున్నామని అధికారులకు విన్నవించారు. ఇప్పటి వరకు రూ. 7 కోట్ల పనులు చేశామని ఆందోళన చెందవలసిన పని లేదని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు డీఈ జయప్రకాష్, జేఈ బాషా తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంపై ఫ్రెంచ్ మహిళ పరిశీలన



సమీకృత వ్యవసాయం చేస్తున్న రైతులతో ఫ్రెంచ్ దేశస్తురాలు రేణుకజార్జ్

సంబేపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లెలో టీ. నందకళ అనే మహిళ డీఆర్‌పీఎం పద్ధతిలో చేస్తున్న సమీకృత వ్యవసాయవిధానాన్ని ఫ్రెంచ్ దేశస్థురాలు రేణుక జార్జ్, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఎన్ఎఫ్ఏలు వెంకట్రమణనాయక్, పవన్‌కుమార్‌లతో కలిసి బుధవారం సందర్శించారు. సమీకృత వ్యవసాయంపై రైతులతో మాట్లాడారు. రైతు కుటుంబ వివరాలు, వ్యక్తిగత, ఆర్థిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఆర్ మానస డీఎంఎంటీ సుబ్రమణ్యంఆచారి, యూనిట్ ఇన్‌చార్జి శ్రీదేవి, నారాయణ, లక్ష్మి, హరిప్రసాద్, సుధాకర్, శివయ్య, సీడీఎఫ్ వెంకటేశ్వర్లు, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

'ప్రకృతి' ఉత్పత్తుల స్టాల్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ వద్ద అధికారులు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ సూచించారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 150 మంది రైతులు ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగుచేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ సరస్వతి, మండల యూనిట్ ఇన్‌చార్జిలు గంగిరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, లక్ష్మీదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



బాలికలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):బాలికలు ఆరోగ్యసూత్రాలు తప్పకుండా పాటించాలని ఎంఈవో 1 చక్రేనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో దేవళంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి రోజు ఆహారం తీసుకొనే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, రమణమ్మ హెల్త్ సూపర్‌వైజర్ మణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణతో రైతులకు ఇబ్బందులు



ఆక్రమణకు గురైన దారిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అగ్రహారం - కస్తూరిరాజు గారి పల్లె వెళ్లే దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం దారిని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. వంద సంవత్సరాలుగా వినియోగంలో ఉన్న దారిని కబ్జా చేయడంతో రైతులను ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ అధికారు లు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దేవళంపల్లెలో చెన్నకేశవ స్వామి దేవస్థానం భూములు ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఈ విషయంపై 2022లో స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుదర్శన్ రెడ్డి, జగదీష్, వీరాంజనేయులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రహదారుల మరమ్మతులు



రహదారి పనులు చేస్తున్న కూలీలు

సిద్దవటం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జ్యోతి, వెంకటాయ పల్లె గ్రామాలకు వెళ్లే రహదారుల మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం ఆ పనులను ఏఈ గంగిరెడ్డి పరిశీలించారు. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయాలని, నాసిరకంగా పనులు చేస్తే బిల్లులు మంజూరు కావన్నారు.

అట్టముక్కలతో అయోధ్య మందిరం నమూనా



రామమందిరం నమూనాతో ఉపాధ్యాయుడు రమణ

పుల్లంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా మండలంలోని దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమణ అట్టముక్కలతో అయోధ్య రామ మందిరం నమూనా తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన అభ్యసనలో భాగంగా విద్యార్థులతో అట్ట ముక్కలతో పలురకాల వస్తువులు తయారు చేయించి ప్రదర్శించామని, నాలుగో తరగతికి చెందిన చారిత్రక ప్రదేశాలు చూసి వద్దామనే పాఠ్యాంశంలో భాగంగా రామమందిరం నిర్మాణం నమూనా తయారు చేసి విద్యార్థులకు వివరించామన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు సహకరించాలి

రాయచోటిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు పోలీసులు సహాయ సహకారాలు అందించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి కోరారు. బుధవారం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రశేఖర్ చేతుల మీదుగా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి -2016 ముఖ్యాంశాలకు సంబంధించిన ఈ బుక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా దివ్యాంగులను చిన్న చూపు చూస్తే ఈ సెక్షన్ల కింద చట్టా ప్రకారం చర్యలు ఉంటాయని, ఈ చట్టాలను పోలీసులు అమలు చేసి దివ్యాంగులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు.



వేడుకగా శోభాయాత్ర

- రామయ్యను చూసేందుకు పోటెత్తిన జనం
- యాత్ర పొడవునా రెట్టించిన ఉత్సాహంతో భక్తజనం
- కడపలో మార్మోగిన జైశ్రీరామ్ నామధేయం
- ఆకట్టుకున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణం

కడప కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో రాములోరి మహా శోభాయాత్ర అత్యంత వేడుకగా సాగింది. శ్రీరామచంద్రమూర్తి అయోధ్యలో బాలరాముడుగా కొలువుదీరి సరిగ్గా ఏడాది పూర్తి అయిన సందర్భంగా.. అయోధ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు నగర మునిసిపల్ మైదానం నుంచి శోభాయాత్ర సాగింది. ఇందులో భాగంగా కోదండరాముడి భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా రూపొందించిన శ్రీరామరథంపై కొలువుదీర్చారు. ఒక చేతిలో బాణం, మరో చేతిలో ధనస్సు చేతబూనిన దివ్య మంగళరూపంతో జగదభిరాముడి శోభాయాత్ర నిర్వహించారు.

అడుగడుగునా భక్తజనం ఉత్సాహంతో అలుపు సొలుపు లేకుండా ముందుకు కదిలారు. శోభాయాత్రలో శ్రీరామచంద్రుడి విగ్రహం చూసేందుకు పుర వీధులు భక్తజనంతో పోటెత్తాయి. మున్సిపల్ మైదానం నుంచి బయలుదేరిన శోభాయాత్ర శంకరాపురం, అప్సరా సర్కిల్, ఎన్జీవో కాలనీ, వై.జంక్షన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్‌సర్కిల్ వద్దకు మధ్యాహ్నం 2 గటలకు చేరుకుంది. అక్కడ భక్తుల కోసం సండే గ్రూప్ సభ్యుల సౌజన్యంతో బి.మఠం ఎంపీటీసీ ముత్యాల రామగోవిందరెడ్డి సారథ్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించి తిరిగి నూతనోత్తేజంతో శోభాయాత్రలో ముందుకు సాగారు. ఎస్పీ బంగళా, రాజారెడ్డి వీధి, కో-ఆపరేటివ్ కాలనీ, అన్నమయ్య సర్కిల్, క్రిష్ణా సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్ గాంధీ విగ్రహం, పాతబస్టాండ్, 7రోడ్స్ ఇందిరమ్మ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, కాగితాలపెంట, ఐటీఐ సర్కిల్, సంధ్యాసర్కిల్, యర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్ పార్క్ మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండరామాలయం వరకూ శోభాయాత్ర సాగింది.

శోభాయాత్ర ఆద్యంతం భక్తులు జై శ్రీరామ్ అంటూ నినదించారు. పిల్లలు, పెద్దలు, యువకులు, వృద్ధులు, మహిళలు, యువతులు అనే తేడా లేకుండా రాములోరి శోభాయాత్రలో అడుగులు కలిపారు. శోభాయాత్ర సాగుతున్న ప్రదేశాలలో పలుచోట్ల భక్తులకు దాతలు అన్నప్రసాదాలతో పాటు మంచినీరు, మజ్జిగ ఏర్పాటుచేశారు.



కడప నగరంలో జరిగిన శ్రీరాముల శోభాయాత్రలో పాల్గొన్న అశేష భక్తజనం


శోభాయాత్రలో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శోభాయాత్రలో రాములోరి విగ్రహం ముందు భాగాన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రధానంగా వరంగల్ నుంచి వచ్చిన తప్పెట మహిళా కళాకారులు లయబద్ధంగా వాయించిన వాయిద్యం అలరించింది. శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లికి చెందిన పానీల శంకర బృందం తప్పెటగుళ్ల కళాకారులు ప్రదర్శించిన నృత్యం భక్తులను కట్టిపడేసింది. అన్నమయ్య జిల్లా సుండుపల్లెకు చెందిన శ్రీనాగారపమ్మ తల్లి చెక్కభజన గురునాథ్ బృందం ప్రదర్శించిన చెక్కభజన రంజింపచేసింది. కడపకు చెందిన కాలేజీ విద్యార్థినిలు ప్రదర్శించిన కోలాటం, రామనామ తాళం రంజింప చేశాయి.

ప్రత్యేక ఆకర్షణగా స్వాముల వేషధారణలు

శోభాయాత్రలో శ్రీరాముడు, సీతాదేవి, పార్వతి, పరమేశ్వరుడు, హనుమంతుడు, కాళికామాత తదితర దేవతామూర్తుల రూపాలలో గుంటూరుకు చెందిక కొంతమంది కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి రూపాలను తిలకించిన భక్తులు రెండుచేతులెత్తి మొక్కుకున్నారు. మరికొంతమంది వారితో ఫొటోలు దిగారు.


శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా హనుమంతుడు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

శోభాయాత్రకు ముందు ఉదయం 8 గంటలకు మునిసిపల్ మైదానంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై నిర్వహించిన సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు విజయ్‌భట్టర్ సారథ్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అయోధ్య ఐక్యవేదిక ప్రతినిధులు వెంకటరెడ్డి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవి, నగర మేయర్ సురేశ్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కమిషనర్ మనోజ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, నాయకులు ఎం. శ్రీనివాసులురెడ్డి, వై.హరినారాయణరావు, మునగా సతీశ్‌కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కడప నగరంలోని మున్సిపల్ స్టేడియంలో బుధవారం ఉదయం జరిగిన సీతారాముల కల్యాణంలో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు, కల్యాణానికి హాజరైన భక్తులు


కల్యాణోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా కేరళ వాయిద్యాలు

లక్ష మంది చిన్నారులకు సంరక్షణ

- ఐసీడీఎస్ పీడీ రమాదేవి

పీలేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న 2275 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 0-3 ఏళ్ల మధ్య ఉన్న 1.05 లక్షల మంది చిన్నారులను సంరక్షిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాసు, కావలిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అందుతున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు చేరవేసే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. జిల్లాలోని అధిక శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయని, 750 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, 450 కేంద్రాలు ఎలాంటి అద్దె కట్టాల్సిన అవసరం లేని భవనాల్లో ఉన్నాయని తెలిపారు. 'నాడు-నేడు' పథకం ద్వారా 141 భవనాల పనులు జరుగుతున్నాయని ఆమె వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 143 పోస్టుల్లో 116 పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. మిగిలిన పోస్టులు కోర్టు కేసుల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని, మాతృభాషాభివృద్ధిని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రారంభించాలన్న తలంపుతో ప్రభుత్వం ప్రతి కేంద్రానికీ తెలుగు అచ్చు పుస్తకాలు అందజేసిందన్నారు. అనంతరం ఆమె ఆయా కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో రాజమ్మ, సూపర్‌వైజర్లు అక్కాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిర, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.


కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు : సీఐ

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైల్వేకోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బెల్టుతీయరా' అనే శీర్షికన కథనం వచ్చింది. దీనికి స్పందించిన పోలీసులు మద్యం దుకాణాల పరిసర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు పెడతామన్నారు. ప్రతి మద్యం దుకాణం యజమాని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రతి దుకాణం వద్ద బార్‌లాగా ఏర్పాటు చేసి తాపిస్తున్నారని దానిపై కూడా దాడులు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై పోలీసుల దాడి

కాలు విరిగేలా కొట్టారంటూ విలపించిన బాధితుడు



పోలీసుల దెబ్బలకు కాలు విరిగిన లారీ డ్రైవర్ నహీద్, డ్రైవర్ చొక్కా పట్టుకుని లాక్కెళుతున్న సీఐ

మదనపల్లెఅర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌కు చెందిన ఎండీ నహిద్ సత్యసాయి జిల్లా కదిరిలో ఓ లారీ యాజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి కదిరి నుంచి తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లోని పేపర్‌మిల్లుకు కలపను లారీలో వేసుకుని రాత్రి 11.45 గంటలకు మదనపల్లె చేరుకున్నాడు. మదనపల్లె తాలుకా పోలీసులు జాతీయ రహదారిలో లారీని ఆపి రికార్డులను చూపమని చెప్పడంతో తెలుగు రాని డ్రైవర్ అర్థం కాక అక్కడే ఉండిపోయాడు. క్యాబిన్‌లోని రికార్డులు వెతుకుతుండగా పోలీసులు విచక్షణారహితంగా కాళ్లపై కొట్టడంతో ఎడమకాలు విరిగి స్పృహ కోల్పోయాడని తోటి డ్రైవర్ చెప్పాడు. కనికరం లేకుండా పోలీసులు మరో రెండు తగిలించండి అంటూ మళ్లీ కొట్టారని నహీద్ అతడు తెలిపాడు. వెనుక వస్తున్న మరో లారీ డ్రైవర్ మహబూబ్‌బాష పోలీసులను ప్రాధేయపడి నహీద్‌కు అండగా నిలిచాడు. బుధవారం ఉదయం లారీ యూనియన్ల నాయకులకు జరిగిన విషయం చెప్పి చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఎడమకాలు విరిగిందని చెప్పారు. ఈ విషయం పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి లారీ యూనియన్ సభ్యులు సిద్ధం అవుతున్న క్రమంలో జిల్లా ఆస్పత్రి వద్దకు తాలుకా సీఐ కళావెంకటరమణ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మరో డ్రైవర్ మహబూబ్‌బాషను చొక్కా పట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. దీంతో లారీ యూనియన్ నాయకులు మదనపల్లె డీఎస్పీకి సీఐపై ఫిర్యాదు చేశారు. ఈ విషయంగా తాలుకా సీఐ కళావెంకటరమణను వివరణ కోరగా డ్రైవర్లు తమ కానిస్టేబుల్‌ను కాలర్ పట్టుకున్నారని, ఈ విషయం తాను వారికి చెబుతున్నా వినకుండా తనను కూడా లెక్క చేయకుండా వారు మాట్లాడినట్లు తెలిపారు. రూట్‌పై అక్రమ వాహనాలను అరికట్టడానికి మేము ప్రయత్నం చేశామని తెలిపారు. రక్షణ కల్పించే పోలీసులపైనే దాడికి ప్రయత్నించడం తప్పు కాదా అని ప్రశ్నించారు.

అర్జీల పరిష్కారంపై క్షేత్రస్థాయిలో పరిశీలన

రామాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారం ఎలా జరుగుతుందో తెలుసుకోవడానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామాపురం మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన కొన్ని అర్జీలను పరిశీలించేందుకు బుధవారం ఉదయం రామాపురం మండలాన్ని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారాల గురించి రామాపురం మండల తహసీల్దార్‌కు సూచనలు చేశారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

త్రీడీ ప్రింటర్లకు ఫ్యూజ్డ్ ఫిలమెంట్

- మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : త్రీడీ ప్రింటర్ల అభివృద్ధి కోసం ఫ్యూజ్డ్ ఫిలమెంట్‌ను విద్యార్థులు తయారుచేశారు. బుధవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలియర్ మెకానికల్ విభాగానికి చెందిన రూపశ్రీ ఒజా పర్యవేక్షణలో విద్యార్థులు ఆదిల్, చైతన్య, వై.దినేష్‌రెడ్డి, జయసూర్య, మహేంద్రాలు ప్లాస్టిక్ సంచులు, వాటర్‌బాటిల్స్‌ను ఉపయోగించి ఫిలమెంట్‌ను తయారు చేశారు.

నిరుపయోగంగా ఉన్న వ్యర్థాలను ఉపయోగించి త్రీడీ ప్రింటర్స్‌కు అనుగుణంగా తక్కువ ఖర్చుతో తయారు చేశారు. త్రీడీ ప్రింటర్స్‌ను కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర వాటిలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. దీని ద్వారా పర్యావరణానికి ఎ టువంటి ఆటంకం లేకుండా దీనిని రూపొందించారు. ప్రాజెక్టును రూపొందిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి భాస్కరన్ తదితరులు అభినందించారు.


ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తాత్కాలిక పనులకే పరిమితమా..?

- గండ్లు పడిన చెరువులు.. కాల్వలను పట్టించుకోని ప్రభుత్వం
- పంటలు ఎలా సాగు చేయాలని ప్రశ్నిస్తున్న రైతులు

పెద్దమండ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో గండ్లు పడిన చెరువు కట్టలు, ఆయకట్టు సాగు కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు, మట్టి పనులకే పరిమితమయ్యాయి. ఐదేళ్లుగా మండలంలో పలు చెరువు కట్టలు, సాగు కాల్వలకు గండ్లు పడడంతో ఆయా చెరువుల ఆయకట్టుదారులు పంటల సాగుకు సుముఖత చూపడం లేదు. ఆయకట్టు భూముల్లో పంట సాగు చేస్తే పంట తుది దశలో చెరువు నీరు పంటకు అందడం కష్టమౌతోందంటున్నారు. గతంలో పంట సాగుతో కోత సమయంలో నీరందక పంటలు ఎండిపోయిన సంఘటనలు ఉన్నాయి.

పెద్దమండ్యం మండలంలో ఈ కోవకు చెందిన చెరువుల సాగు కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆయా ప్రాంతంలో చెరువులు నిండిన రైతులు వరి పంటలు సాగు చేయడం లేదు. చెరువు నీరు పుష్కలంగా ఉన్న తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన సాగు కాల్వలను నమ్ముకుని పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేయడం లేదు. ఐదేళ్లుగా చెరువు సాగు కాల్వలు శాశ్వత పనులు చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దీంతో ప్రస్తుతం మండలంలో పలు చెరువులు నిండినా సాగు కాల్వల దుస్థితితో వరి పంటలు పండించుకోలేకపోతున్నారు.

మండలంలోని పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంటకు వచ్చే వర్షపు నీటి కాల్వకు (పెద్దమండ్యం యల్లమ్మగుడి వద్ద) తాత్కాలిక మరమ్మతులు చేశారు. కలిచెర్ల పాపిరెడ్డి చెరువు గండి పడిన సాగు కాల్వకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. బసిరెడ్డిచెరువు మొరవ కాల్వకు గండిపడడంతో తాత్కాలిక మట్టి వేశారు. ఈ చెరువు నీరు ఎర్రగుట్ట చెరువు, ఉప్పరపల్లి చెరువుకు పోతాయి. తాత్కాలిక మట్టి మరమ్మతు పనులు ఆయకట్టు రైతులే చేపట్టారని పలువురు రైతులు తెలిపారు. వర్షాకాలంలో చెరువులకు వర్షపు నీరు చేరినా రైతుల్లో ఉత్సాహం బదులు నిరుత్సాహం కనిపిస్తోంది. గండి పడిన చెరువులకు మరమ్మతులు చేస్తే ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేస్తామని పలువురు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని మండలంలో గండి పడిన చెరువు కట్టలు, కాలువలకు మరమ్మత్తులు చేయాలని రైతులు కోరారు.



బాటవారిపల్లి సమీపంలో బసిరెడ్డిచెరువు కాల్వకు తాత్కాలికంగా మట్టితో చేసిన మరమ్మతులు

పనులకు ప్రతిపాదనలు పంపించాం

- శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చార్జ్ ఏఈఈ ఇరిగేషన్

మండలంలోని చెరువు కట్టలు, కాలువలు గండిపడిన 11 చెరువులను గుర్తించాం. ఆ చెరువుల అభివృద్ధి పనులకు రూ.6.5 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరైన వెంటనే చెరువుల అభివృద్ధి పనులు చేపడతాం.

బకాయిలను చట్టబద్ధంగా వసూలు చేయాలి

కడప రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిదారులకు రికవరీ, చట్టపర పద్ధతులను వివరించి బకాయిలను వసూలు చేయాలని స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ బి. గుర్రప్ప ఆదేశించారు. డీసీసీబీ కార్యాలయంలో బ్యాంకు సూపర్‌వైజర్లతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, బ్రాంచిల్లో ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా మంజూరు చేసిన రుణాలు, వాయిదా మీరిన బకాయిలను వసూలు చేయాలన్నారు. మొండిబకాయిలు, బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చూపిన బకాయిదారుల స్థిర, చరాస్తుల జప్తు, వేలానికి అత్యవసర చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు అధికారులు నారాయణరాజు, పి.చంద్రశేఖర్, ఆంజనేయులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల ఆధార పత్రాల పరిశీలన



నిర్వాసితుల ఆధార పత్రాలు పరిశీలిస్తున్న డీటీ వేణు

జమ్మలమడుగు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన కొండాపురం మండలం పి.అనంతపురం గ్రామానికి చెందిన నిర్వాసితులు వారి వారి ఆధార పత్రాలను పరిశీలించుకొనుటకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. గతంలో గైర్హాజరైన 152 మంది పీడీఎఫ్ఎస్‌కు ప్రత్యేక గ్రీవెన్‌డే జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఆర్డీవో కార్యాలయం వద్దకు కొండాపురం నిర్వాసితులు పి.అనంతపురం గ్రామానికి చెందిన బాధితులు వస్తారని, ఏదైనా గొడవలు చోటు చేసుకుంటాయేమోనని భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో జమ్మలమడుగు పట్టణంలో హంగామా నెలకొంది. ఉదయం 10.30 గంటలకు డీఎస్పీ వెంకటేశ్వరరావు సభాభవనం వద్ద ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్లను సందర్శించారు. అక్కడే పోలీసు అధికారులతో ఆయన మాట్లాడారు. ఆయనతోపాటు అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది సుమారు 12 మందికిపైగా ఏర్పాటు చేశారు.

- ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో నిర్వాసితుల కోసం ఆధార పత్రాల పరిశీలనకు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. బయట ఒక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడే భారీగా పోలీసు బందోబస్తు. మధ్యాహ్నం వరకు కౌంటర్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. అప్పుడప్పుడు పి.అనంతపురం గ్రామానికి చెందిన 152 మందికిగాను నలుగురు మాత్రమే సాయంత్రం 5.30 గంటల వరకు హాజరైనట్లు కౌంటర్-1లో ఉండే అధికారి డిప్యూటీ తహసీల్దారు వేణు తెలిపారు. దీంతో నిర్వాసితుల పరిశీలన కార్యక్రమం సాయంత్రానికి ముగిసింది. అధికారులంతా పోలీసు సిబ్బంది మొత్తం హాజరవుతారని ఎదురుచూశారు. కానీ నలుగురు మాత్రమే హాజరుకావడం, ఎవ్వరూ రాకపోవడంతో అనేక విమర్శలు వెల్లువెత్తాయి. పూర్తిగా ఆధారాలు ఉంటే నిర్వాసితులు వచ్చేవారని, ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటలు ఉంటే నలుగురు మాత్రమే హాజరుకావడం అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి చర్యలు : జడ్జి

కడప రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫ క్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా స్థాయి అధికారుల మానిటరింగ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. పరిహార చెల్లింపులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఆడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ హేగ్డే, డీటీసీ డీఎస్పీ కరీం, కడప రెవెన్యూ డివిజనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీ.. వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలో నాలుగు లైన్ల రహదారిలో ఒక డాబా ఎదురుగా బుధవారం 18 టైర్ల ట్యాంకర్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. డాబా వద్ద నుంచి రోడ్డు దాటుతుండగా ఈ సంఘటన జరిగింది. మృతుని శవం నుజ్జు అవడంతో ఎవరు అనే విషయాన్ని పోలీసులు గుర్తుపట్టలేకపోయారు. ట్యాంకర్‌ను అదుపులోకి తీసుకుని మృతుని వివరాల కోసం ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని సంచిలో కట్టి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కట్నం కోసం వేధింపులు

చాపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన చెట్టూరి అఖిల (23)ను ఆమె భర్త, అత్త కట్నం కోసం వేధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 2022లో అఖిలను ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లెకు చెందిన సుధీర్‌కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఒక కూమార్తె ఉంది. పెళ్లి అయిన మూడు నెలల నుంచి సుధీర్‌కుమార్, ఆయన తల్లి జయమ్మ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పరపల్లెలోని అత్తగారి ఇంటి నుంచి ఆమెను వెళ్లగొట్టారు. ప్రస్తుతం అఖిల పల్లవోలు గ్రామంలోని అమ్మగారి ఇంటిలో ఉంది. అఖిల ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్ ట్యాంకర్‌ను బలవంతంగా తీసుకెళ్లారు

దువ్వూరు, జనవ రి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న తన ఆయిల్ ట్యాంకర్‌ను బలవంతంగా తీసుకెళ్లారని చాపాడు మండలం నరహరిపురం గ్రామానికి చెందిన రామాంజినేయులరెడ్డి దువ్వూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరులో ఆయిల్ వ్యాపారం చేస్తున్న రామాంజినేయులరెడ్డి తన ఆయిల్ ట్యాంకర్ ప్రొద్దుటూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా దువ్వూరు సమీపంలో మధుసూదన్‌రెడ్డి, చల్లా ఆది రాజారెడ్డి మరి కొంత మంది కారులో వచ్చి అడ్డగించారు. మీ యజమాని మాకు డబ్బులు ఇవ్వాలంటూ డ్రైవర్‌ను కిందకు దింపి బలవంతంగా ట్యాంకర్‌ను తీసకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి చెందిన ఆంజనేయులు(35) గుర్తుతెలియని రైలుకింద పడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న మృతుడు తాగుడుకు అలవాటు పడి ఇంటికి రాకుండా తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. అయితే భార్యాపిల్లలతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు, ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసుకుని మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

సీఎం హామీలు అమలు

- పారిశుధ్య కార్మికులకు రూ.లక్ష నగదు బహుమతి అందజేసిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



కలెక్టర్, జేసీ చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న అమ్ములమ్మ, చెన్నమ్మ, గంగాధర్

కడప కలెక్టరేట్/మైదుకూరు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరు పర్యట నలో భాగంగా ఇచ్చిన హామీలు అమలవుతు న్నాయి. పారిశుధ్య కార్మికుల కృషిని గౌర విస్తూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ముగ్గురు పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయిల నగదు బహుమతిని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తన చాంబరులో బుధవారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మైదుకూరు పారిశుధ్య కార్మికులు పి.అమ్ములమ్మ, జి.చెన్నమ్మ, యం.యుగంధర్ విలు వలు పాటిస్తూ విధుల పట్ల అంకిత భావంతో సమాజ శ్రేయస్సుకు ఎంతో విలువైన సేవలందిస్తున్నారు. రోజూ ఉదయం 5-30 గంటలకే విధులకు హాజరై మైదుకూరు రోడ్లు, టౌన్, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతున్నారన్నారు వీరి కృషి, పట్టుదలను గుర్తించిన ముఖ్యమంత్రి ఈనెల 18న మైదుకూరు సభలో ఒక్కొక్కరికి లక్ష రూపా యిల చొప్పున ముగ్గురికి మూడు లక్షల నగదు బహుమతిని ప్రకటించారన్నారు. సీఎం ఇచ్చిన హామీని అమలు చేస్తూ కలెక్టర్ ముగ్గురు పారిశుధ్య కార్మికులకు రూ.3 లక్షల నగదును చెక్కు రూపంలో అందించారు. తమ సేవలను గుర్తించి నగదు బహుమతి ప్రకటన చేసిన ముఖ్యమంత్రికి పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, మైదుకూరు మున్సిపల్ కమిషనరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాటల పోటీల్లో అంధ విద్యార్థినికి ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న నజియా తుబుసం

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం స్కౌట్ హాల్లో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో కడప నగరం శంకరాపురం ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థిని నజియా తుబుసం దేశభక్తి పాటల పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ విద్యార్థినికి కడప ఉప విద్యాధికారి రాజ గోపాల్‌రెడ్డి బహుమతి అందజేశారు. స్కౌట్ జిల్లా కార్యదర్శి ప్రమీల ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబినేజర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వు 117కు ప్రత్యామ్నాయాలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వు 117కు ప్రత్యామ్నాయాలను వివరిస్తూ ప్రత్యేక డాక్యుమెంట్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు సంఘం తరపున సమర్పించినట్లు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి.. ఆ తర్వాత జీఓ 117ను రద్దు పరచాలి.. కొత్త నిబంధనల ప్రకారం స్టాఫ్ ప్యాటర్న్ లెక్కించాలని తదితర విషయాలపై వివరించినట్లు తెలిపారు.

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్‌ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేథ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల బస్తాల స్టాకును పరిశీలిస్తున్న ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏవో శివశంకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల యజమానులు వ్యవసాయ శాఖ నియమ నిబంధనలను అనుసరించి వ్యాపారలావాదేవీలు కొనసాగించాలని, లేనిపక్షంలో లైసెన్సు రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న మహాలక్ష్మి, కేవీఎస్‌ఆర్ ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ పి.సురేష్‌రెడ్డి, ఏవో ఎస్.శివశంకర్‌రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని రికార్డులను, బిల్లుబుక్కులను, స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అమ్మిన ప్రతి బస్తాకు నగదు బిల్లు రైతులకు ఇవ్వాలని తెలిపారు. ఎరువుల బస్తాల్లో, తూకాల్లో ఏవైనా అవకతవకలు ఉంటే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ప్రతి డీలరు లైసెన్సు కలిగి ఉండి గోడౌన్ అనుమతి ఉండాలని ఎరువుల ధరను రైతులకు కనిపించేలా నోటీసు బోర్డులో రాసి పెట్టాలని సూచించారు.

పైలెట్ ప్రాజెక్టు గ్రామాన్ని సందర్శించిన జేసీ



ఇడమడకలో రీ సర్వే గురించి ఆరా తీస్తున్న జేసీ

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో బుధవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పర్యటించారు. మొదట మండల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారంపై తహసీల్దారు ద్వారా ఆరా తీసి.. కొన్ని సూచనలు చేశారు. అనంతరం పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపికైన ఇడమడకకు ఆర్డీవో సాయిశ్రీతోపాటు స్థానిక అధికారులతో కలిసి వెళ్లారు. అక్కడ భూ సంబంధ సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేకు సంబంధించి కొన్ని సూచనలు ఇచ్చారు. తహసీల్దారు అక్బల్‌బాష, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ చొరవతో..... కడపకు చేరుకున్న మృతదేహం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి

కడప క్రైం, జనవరి 22. (ఆంధ్రజ్యోతి) : కడపకు చెందిన షేక్ మహ్మద్ అనీస్ అన్సారీ జీవనోపాధి కోసం మస్కట్ వెళ్లి అక్కడ గుండెపోటు రావడంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులు సోషల్ మీడియా ద్వారా మంత్రి లోకేశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన స్పందించారు. మంత్రి చొరవతో మృతదేహాన్ని కడపకు రప్పించారు. దీంతో కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలియపరిచారు. మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు జరిపారు. విషయం తెలుసుకున్న జిల్లా టీడీపి అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వాసు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

'నిబంధనల మేరకే ములాఖత్‌లు'

కడప క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభ విస్తున్న, రిమాండ్ ఖైదీలకు నిబంధనల మేరకే ములాఖత్‌లు అవకాశం ఇస్తున్న ట్లు డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్ బుధవారకం ఒక ప్రకటలో వివరించారు. ఖైదీలకు అల్పాహార సౌలభ్యం కూడా నిబంధనల ప్రకారం ఇస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖైదీలకు వసతి కల్పిస్తామని తెలిపారు.

స్కూటరు - లారీ ఢీ.. ఇరువురు దుర్మరణం



కడప క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సెంట్రల్ జైలు వద్ద బుధవారం రాత్రి స్కూటరును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల మేరకు.. కడప నగరం రామాంజ నేయపురంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పడిగ ప్రవీణ్ (27) అతని బంధువు వి.సుభాష్ (23) పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో టౌనుకు వెళ్లి తిరిగి వస్తుండగా కడప సెంట్రల్ జైలు వద్దకు రాగానే తిరుపతి నుంచి కర్నూలు వైపు వెళుతున్న ఓ లారీ వేగంగా వచ్చి స్కూటరును ఢీకొంది. ఈ ప్రమా దంలో ఇరువురు మృతి చెందారు. విషయం తెలుసుకున్న రిమ్స్ పోలీసులు సంఘ టనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మార్చు రీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూలు సమీప వీధిలో మంగళవారం అర్ధరాత్రి గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో 30 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల యజమాని టి.ఓబులేసు లబోదిమంటూ విలపిస్తున్నారు. బాధితుడి వివరాల మేరకు... చలికాలం కావడంతో టి.ఓబులేసు కుటుంబీకులతో కలసి ఇంటిలో నిద్రిస్తున్నారు. ఆరుబయట పాకలో గొర్రెలు ఉన్నాయి. కుక్కలు గుంపులుగా వచ్చి పాకలోని మూగజీవాలపై దాడి చేసి ఇష్టమొచ్చినట్లు వాటిని కొరికి చంపాయి. శబ్దాలు వినిపించడంతో గొర్రెల యజమాని నిద్రలేచి వచ్చి చూశాడు. సంఘటన గమనించి కేకలు వేవేయగా.. కుక్కలు పారిపోయాయి. అయితే అప్పటికే 30 గొర్రెలను కొరికి చంపేశాయి. మరో 10 గొర్రెలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి. బుధవారం ఉదయం పశువైద్యశాఖ అధికారులు వచ్చి పరిశీ లించి... గాయపడిన గొర్రెలకు చికిత్స చేశారు. గొర్రె ల మృతితో రూ.4లక్షలు నష్టం వాటిల్లిందని.. ప్రభు త్వం ఆదుకోవాలని బాధితుడు ఓబులేసు కోరుతు న్నాడు. కాగా, గ్రామ పంచాయతీ కుక్కల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో ఈ ప్రాంతంలో కొత్త కుక్కలు వదిలి వెళ్లారని, అవి దాడులకు పాల్పడుతున్నాయని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల బెడద సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వంక ఆక్రమణ స్థలంలో బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

గుర్రంకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వంక పోరం బోకు స్థలాన్ని రియల్ వ్యాపారులు ఆక్రమించుకోవడంతో బుధవారం రెవెన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద సర్వే నెంబరు 503/8లో 1.01 ఎకరాల్లో వంక పోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలాన్ని కొందరు రియల్ వ్యాపారులు ఆక్రమించుకొని మట్టితో చదును చేశారు. ఈ వంక గుండా వర్షపు నీరు మురాద్‌బీ కుంటకు చేరుతాయి. ఈ నేపథ్యంలో వంక ఆక్రమణపై గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు గత ఏడాది డిసెంబరు నెల చివరలో వంక ఆక్రమాలను సర్వే చేసి సరిహద్దులను గుర్తించారు. ఇందులో భాగంగా ఆక్రమాలకు గురైన వంక పోరంబోకు స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలంలోకి ఎవరైనా ప్రవేశిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు సదాశివ, అమీర్, సర్వేయర్ వినోద్ పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు

● జనసేన నాయకురాలు దారం అనిత



గ్లాసును ప్రదర్శిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి గాజు గ్లాస్ గుర్తును రిజర్వ్ చేసిన కేంద్ర ఎన్నికల సంఘానికి మదనపల్లె జనసేన పార్టీ నాయకురాలు దారం అనిత పార్టీ తరపున ధన్యావాదాలు తెలిపారు. బుధవారం మదనపల్లెలో తమ పార్టీకి కేటాయించిన గాజుగ్లాసు గుర్తును ప్రదర్శించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రెండు ఎంపీ స్థానాలు, 21 ఎమ్మెల్యే స్థానాలలో అధిక మెజార్టీతో గెలుపొందిన ఘనత జనసేనకు ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన స్టేట్ కమిటీ మెంబరు, రాయలసీమ రీజినల్ కో- ఆర్డినేటర్ అనిత, జనసేన నాయకులు హరిప్రసపాద్, కుప్పాల శంకర, సూరి, ప్రకాష్, సురేంద్ర, శంకరప్ప, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయ పూజారి ఆకస్మిక మృతి

పెద్దతిప్పసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలోని పాపాఘ్నీ నది ఒడ్డున వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయ పూజారి రామచంద్రశాస్త్రి (65) బుధవారం ఆకస్మికంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన ఆలయంలో సుమారు 40 ఏళ్లుగా పూజలు అందించారు. ఇతని స్వగ్రామం టి.సదుం పంచాయతీ అనంతపురం గ్రామం. బుధవారం ఉదయం ఇంటి వద్ద ఉన్నట్లుండి చాతిలో తీవ్ర నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు శస్త్ర చికిత్సలు అందించి ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలియడంతో టి.సదుం పంచాయతీలోని పలువురు నివాళులర్పించారు.

షాపింగ్‌మాల్‌కు ప్రణాళికలు: ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని టిప్పుసుల్తాన్ మైదానం వద్ద షాపింగ్‌మాల్, ఆస్పత్రి నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక టిప్పుసుల్తాన్ మైదానం వద్ద కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణం అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ములకలచెరువు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లెలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 145 మంది చదువుకుంటున్నారన్నారు. కాలువపల్లెలో ఉన్నత పాఠశాల లేకపోవడంతో ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌడసముద్రంకు వెళ్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలం లేదని, తగిన స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పునఃపరిశీలన

తంబళ్లపల్లె, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరోగ్య పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం వైద్య బృందం అధికారులు రామ్మోహన్, సునీల్‌దత్, మునికుమార్‌లు కోసువారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, తంబళ్లపల్లె-1 సచివాలయాల పరిధిలోని 29 ఆరోగ్య పింఛన్లను తనిఖీ చేశారు. పింఛనుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కాగా, గురువారం గుండ్లపల్లె, చేలూరివాండ్లపల్లె, గోపిదిన్నె, కొటాల సచివాలయాల పరిధిలోని 31 పింఛన్లను పునఃపరిశీలన చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకులాలు త్వరగా పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పది పంచాయతీలలో మంజూరైన 28 గోకులాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోకులాల పూర్తితో పాటు ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని, ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పనులు చేయాలని తెలిపారు. ఇప్పటికే కొందరి పైన ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం అందిందని, పద్ధతి మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో రమేష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందూరు రోడ్డు, తురకపల్లె వద్ద కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి బుధవారం తెలిపారు. గుట్టుచప్పుడు కాకుండా నిమ్మనపల్లెకు చెందిన వెంకట్రమణారెడ్డి, రెడ్డప్పరెడ్డి, ఆనంద్‌లు కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిపై పోలీసులు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి రూ.5,500లు నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మురుగునీటితో తప్పని తిప్పలు



తిరుపతి రోడ్డులో డ్రైనేజీ లేక రోడ్డు పైనే నిల్వ ఉన్న మురుగునీరు

వాల్మీకిపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిరోడ్డున రెండు కి.మీ. మేర జాతీయ రహదారి వెళ్తుంది. ఈదారిలో నాలుగు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దాదాపుగా రోడ్డుకు ఇరువైపులా నివాస గృహాలు ఉన్నాయి. ఈ ప్రాంతమంతా డ్రైనేజీలు నిర్మాణం లేకపోవడంతో రోడ్డు పైనే మురుగునీటి నిల్వలు పేరుకుపోయాయి. 2014లో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీని పూడ్చేశారు. మళ్లీ డ్రైనేజీ నిర్మాణానికి ఎన్ని ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన తయారైంది. అలాగే పట్టణంలోని పలు కూడళ్లలో డ్రైనేజీ అనుసంధానం లేకపోవడంతో పట్టణంలో ఎక్కడికక్కడ మురుగునీటి నిల్వలు స్తంభించాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరి కొన్ని చోట్ల పట్టణంలోని వెంగమాంబ సర్కిల్, తిరుపతి రోడ్డు, గాంధీ సర్కిల్, హరి మందిరం, తదితర ప్రాంతాలలో డ్రైనేజీ నిర్మాణాలు లేకపోవడంతో మురుగునీరు ఎటు వెళ్లలేక నిల్వ ఉండిపోతోంది. ఇక వర్షం పడితే మురుగునీరు మొత్తం రోడ్డు పైకి వచ్చేస్తోంది. దీంతో ప్రజలు అడుగు తీసి అడుగు పెట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరుపై ప్రజాప్రతినిధులు పలుమార్లు ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంతవరకు అధికారులు స్పందించకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై వాల్మీకిపురం పంచాయతీ ఈవో రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా.. పట్టణ నడిరోడ్డున జాతీయ రహదారి వెంబడి డ్రైనేజీ సమస్య ఉన్న మాట వాస్తవమే అని, డ్రైనేజీని నిర్మించేందుకు పంచాయతీలలో నిధులు లేవన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామ, నిధులు మంజూరు కాగానే డ్రైనేజీ నిర్మాణం చేపడుతామని తెలిపారు.

జగన్‌ది స్వార్థం... చంద్రబాబుది ప్రజా పాలన

● తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమను 2002లోనే ఆర్థిక నష్టాల నుంచి కాపాడి...నేడు తీవ్ర సంక్షోభం నుంచి గట్టెక్కించింది సీఎం చంద్రబాబు నాయుడు అని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటీకరణకు జగన్ అన్ని విధాల సహకరించారని, తనపై ఉన్న కేసుల నుంచి విముక్తి కల్గిస్తే చాలని రాష్ట్ర ప్రయోజనాలతో అవసం లేదన్న ధోరణితో జగన్ వ్యవహరించారని విమర్శించారు. అయితే చంద్రబాబు సీఎం అయిన రోజు నుంచి విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా అన్ని విధాల ప్రయత్నాలు చేశారన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడేందుకు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని సాధించారన్నారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు వినే పరిస్థితిలో లేరన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయని, ఇదొంతా సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ వల్లే సాధ్యమవుతోందన్నారు. కాగా గురువారం మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నేతలు భజంత్రి రామాంజులు, నాయకులు శంకర్ రెడ్డి, ఫజురుల్లా, పాస్టర్ శ్రీనివాసులు, రసూల్ పాల్గొన్నారు.

అమ్మచెరువుమిట్టలో ఆక్రమణలు తొలగింపు

మదనపల్లె అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మచెరువు మిట్టలోని కోళ్లబైలు పంచాయతీలో కమ్యూనిటీ భవనం కోసం వదిలిన స్థలంలో ఆక్రమణలను బుధవారం తొలగించారు. సదరు పంచాయతీలో ఇతరులు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నట్లు కొందరు కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీని ఆయన హెచ్చరించారు. వెంటనే ఆర్ఐ, ఆ పంచాయతీ వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం హుటాహుటిన రెవెన్యూ అధికారులు ఎక్సకవేటర్‌తో ఆక్రమణలను తొలగించారు. ఆర్ఐ శేషాద్రిరావు, వీఆర్వో శివశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరాలు

పాడిరైతులకు ఉపయోగకరం

పెద్దతిప్పసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత పశువైద్యశిబిరాలు పాడి రైతులకు ఎంతగానో ఉపయోగకరమని మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని రంగసముద్రం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరంలో మండల పశువైద్యాధికారి రమేష్‌నాయక్‌తో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ ఉచిత పశువైద్యశిబిరంలో పాడి ఆవులు, లేగదూడలు, మేకలు, గొర్రెలకు పలు రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో రంగసముద్రం పెద్ద చెరువు ఛైర్మన్ చెన్నకేశవ, మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా, కుమ్మర భాస్కర, చింతమాను నారాయణమూర్తి, కుమ్మర కిట్టన్న పాల్గొన్నారు.

చికెన్ వ్యాపారులు శుభ్రత పాటించాలి

గుర్రంకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చికెన్ వ్యాపారులు పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. పట్టణంలోని బస్టాండులో చికెన్, మటన్ వ్యాపారులు రోడ్లపై ఇష్టానుసారంగా మాంసం విక్రయాలను చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు నాణ్యత, పరిశుభ్రత, సద్ది మాంసాన్ని విక్రయిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని, ఈ నేపథ్యంలో పంచాయతీ ఈవో, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని మాంసం విక్రయాలను తనిఖీ చేయాలని సూచించారు. ఆహార నియమాలను పాటించకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ



దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

మదనపల్లెఅర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను హెల్పింగ్‌మైండ్స్ నిర్వాహకులు బుధవారం అందజేశారు. గాజుల రంగమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు గాజుల రమేష్, రూపలు కదిరప్ప అనే దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ చేసి తమ దాతృత్వం చాటుకున్నారని సంస్థ నిర్వాహకుడు అబూబకర్ సిద్దిక్ పేర్కొన్నారు. గత పదకొండేళ్లుగా మదనపల్లె, పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, చరణ్, హర్ష, చైతు, సాంబ పాల్గొన్నారు.

కోటకొండలో లభ్యమైన మరో విగ్రహం



లభ్యమైన విగ్రహం

తంబళ్లపల్లె, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండలో రెండు రోజుల క్రితం విగ్రహాలు బయటపడిన పొలంలోనే బుధవారం మరో పురాతన దేవతా మూర్తి రాతి విగ్రహం లభ్యమైంది. సోమవారం ఉదయం కోటకొండకు సమీపంలోని మద్దిరాళ్లపల్లె సమీప పొలాల్లో ఏటిగడ్డపల్లెకు చెందిన వెంకటేష్ తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నించగా రెండు పురాతన రాతి విగ్రహాలు బయల్పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అదే పొలంలో బుధవారం ఉదయం రైతు పొలం పనులు చేసుకుంటుండగా సుమారు 3 అడుగుల పొడవు, ఒకటిన్నర అడుగు వెడల్పు ఉన్న మరో రాతి విగ్రహం బయటపడింది. రైతు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలపడంతో తహసీల్దారు హరికుమార్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పొలం వద్దనున్న విగ్రహాన్ని పరిశీలించారు. ఈ విగ్రహం విష్ణుమూర్తి విగ్రహమై ఉండవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు. విగ్రహాలు బయల్పడిన విషయంపై చరిత్రకారుడు, ప్రముఖ రచయిత బత్తనపల్లి మునిరత్నంరెడ్డి మాట్లాడుతూ...గతంలో ఈ పరిసర ప్రాంతాలలో వైష్ణవాలయం ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, మూడు రోజుల వ్యవధిలో ఒకే చోట మూడు విగ్రహాలు బయటపడటంతో, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి విగ్రహాలను తిలకిస్తున్నారు.

వృద్ధురాలి ప్రాణాలు కాపాడండి..!



జాతీయరహదారి పక్కన కూర్చున్న వృద్ధురాలు

మదనపల్లెటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనే చిరిగిన దుస్తులతో, ప్లాస్టిక్ బాటిళ్లను కుప్పగా వేసుకుని అటుగా వచ్చిపోయే వారిచ్చే ఆహారపదార్థాలు తింటూ ఆరు నెలలుగా ఎండనకా.. వాననకా అక్కడే కూర్చొని వున్న వృద్ధురాలిని చూసిన వారికి అయ్యో అనిపించక మానదు. కర్ణాటక రాష్ట్రం మాండ్య జిల్లాకు చెందిన సరస్వతి(57)ను ఆరు నెలల క్రితం ఎవరో తీసుకొచ్చి స్థానిక సీటీఎం రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయం ఎదురుగా వదిలి వెళ్లిపోయారు. కాళ్లు కదపలేని స్థితిలో వున్న ఆమె ఎక్కడికి వెళ్లాలో తెలియక, మతిస్థిమితం లేక ఆరు నెలలుగా అక్కడే వుండిపోయింది. వర్షం వస్తే గొడుగు పట్టుకుని, చలి అయితే పాత గుడ్డలు తలకు చుట్టుకుని అక్కడే విలపిస్తూ గడుపుతోంది. అటువైపు వెళ్లే వాహనాలు ఆమె మనిషి అని తెలియక పొరపాటున దుస్తుల మూట అనుకుని మీదికి వస్తే ఆమె ప్రాణాలు పోయే ప్రమాదం వుంది. ఈమె తెలుగు భాష రాక, మాట్లాడలేక ఉంది. ఈ వృద్ధురాలిని స్వచ్ఛంద సంస్థలు, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు, మోడల్ జెండర్ రీసోర్సుసెంటర్ వారు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు.

నేడు సామాజిక సేవా కార్యక్రమాలు

మదనపల్లెటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల శాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా గురువారం మదనపల్లె నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. బుధవారం నీరుగట్టువారిపల్లెలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమాలకు పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్ పరం కానివ్వం : ఎమ్మెల్యే



దీక్షలకు మద్దతుగా కూర్చున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకుందాం అని సీపీఎం చేపట్టిన సామూహిక దీక్షలకు విశేష స్పందన లభించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఇందులో భాగంగా రెండో రోజు దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షలకు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఉపాధ్యాయ సంఘం, అంగన్వాడీ యూనియన్, దళిత సంఘర్షణ సమితి, అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, తదితర సంఘాలు మద్దతు ఇస్తూ దీక్షలో పాల్గొన్నాయి. దీక్ష శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సందర్శించి దీక్షలో ఉన్న సీపీఎం నాయకులకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు విశిష్టమైన సేవలను అందిస్తున్న మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్ పరం కానివ్వమన్నారు. తిరుపతి సిటీలోని స్విమ్స్ ఆస్పత్రి కంటే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికే ఎక్కువ పేషెంట్లు ఓపీ ఉందని, ప్రతి రోజు 20-30 శస్త్ర చికిత్సలు జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ మదనపల్లె ప్రజల ఆకాంక్ష మేరకు మదనపల్లె ఏరియా ఆస్పత్రిని, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిగాను, మదనపల్లెకు మెడికల్ కళాశాలను తెచ్చిన ఘనత వైసీపీదే అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, నరసింహులు, ఉత్తన్న, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే విశాఖ ఉక్కు బలోపేతం

● ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బలోపేతం చేయడానికి రూ.14,440 కోట్లు కేంద్రం మంజూరు చేయడం వెనుక 30 ఏళ్లుగా చంద్రబాబు కృషి వుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వం పాతికేళ్ల నుంచే విశాఖ ఉక్కు కర్మాగారం బలోపేతానికి పార్లమెంటులోనూ, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ స్థాయిల్లోనూ అన్ని కోణాల్లో వత్తిడి తెస్తున్నందు వల్లే ఇది సాధ్యమైందని గుర్తించాలని ఆయన చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కాకుండా ఇంతవరకూ కాపాడుకుంటూ వచ్చింది టీడీపీ ప్రభుత్వమేనని చెప్పారు. సంక్షోభంలో వున్న విశాఖ ఉక్కును గట్టెక్కించేందుకు రూ.18 వేల కోట్లు అవసరమని రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కుమారస్వామిని ఒప్పించడంలో టీడీపీ నాయకత్వంలోని బృందం సఫలమైందన్నారు. ఫలితంగానే ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద వెంటనే రూ.1650 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలోని రాష్ట్ర ప్రయోజనాలన్నీ జగన్ కోర్టు కేసులకు ముడిపెట్టి పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. ఉక్కు ఫ్యాక్టరీ విజయంతో ఉత్తరాంధ్ర మాత్రమే కాకుండా మొత్తం ఏపీ ప్రజలు టీడీపీ కృషిని గుర్తించారని కిశోర్ కుమార్‌రెడ్డి చెప్పారు.

నిధులు సక్రమంగా వినియోగించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

కలకడ, జనవరి 22(ఆంధ్ర జ్యోతి): మండలాభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని చిత్తూరు జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి లక్ష్మీపతి, ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఎంఈవో మునీంద్రనాయక్, ప్రతాప్‌రెడ్డి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని వేద పండితులు బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణాన్ని కనులపండువగా చేశారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో పింఛన్లు తనిఖీ



పింఛన్‌దారుల వివరాలు సేకరిస్తున్న వైద్యబృందం

పెద్దమండ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం గ్రామ పంచాయతీ పరిధిలోని 24 పింఛన్లను వైద్యనిపుణులు తనిఖీ చేశారు. ప్రభుత్వం పక్షపాతం సంబంధించిన తనిఖీలకు శ్రీకారం చుట్టింది. అనర్హుల పింఛన్‌దారులను గుర్తించి తొలగింపు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మండలంలోని 113 పింఛన్‌దారులు ఉండగా వారు ప్రతి నెల ఒక్కొక్కరు రూ.15 వేలు పింఛన్ సొమ్ము తీసుకుంటున్నారు. సోమవారం వైద్యబృందం పెద్దమండ్యం గ్రామ పరిధిలో 24 పింఛన్‌దారులను వైద్యబృందం తనిఖీ చేసింది. పింఛన్‌దారుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వైద్య నిపుణులు జ్యోష్న, భాస్కర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, పెద్దమండ్యం డాక్టర్ ఇమ్మానుయేల్, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అజహరుద్దీన్ బాధ్యతలు



తహసీల్దార్ అజహరుద్దీన్

బి.కొత్తకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల నూతన తహశీల్దార్‌గా నియమితులైన మహమ్మద్ అజహరుద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో డీటీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈయనను బి.కొత్తకోట తహశీల్దార్‌గా (ఎఫ్ఏసీ) నియమిస్తూ కలెక్టర్ శ్రీధర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆయన విధుల్లో చేరారు. డీటీ మహమ్మద్‌అన్సారీ, ఆర్ఐ వీరాంజినేయులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. తహశీల్దార్ మాట్లాడుతూ బి.కొత్తకోట నగరపంచాయతీ కావడంతో సమస్యలు, బాధ్యతలు చాలా వుంటాయని, పలు సమస్యలు ఇప్పటికే తన దృష్టికి వచ్చాయన్నారు.

రైతులకు ఏడు రోజుల శిక్షణ

కలికిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో 'ఫ్రెండ్స్ ఆఫ్ కోకోనట్ ట్రీస్' అనే అంశంపై ఔత్సాహిక రైతులకు ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నైపుణ్య శిక్షణను జాతీయ కొబ్బరి పరిశోధన సంస్థ సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు వారం రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు ముందుగా కేవీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

పెద్దమండ్యం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జిల్లా పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో చెరువుకిందపల్లిలో బుధవారం జరిగిన పశు ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 146 పశువులకు, 38 ఆవులకు, 24 పశువులకు పరీక్షలు నిర్వహించారు. 1500 గొర్రెలకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందించారు. ఈ నెలాఖరు వరకు జరిగే వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తంబళ్లపల్లి పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర, పెద్దమండ్యం పశువైద్యాధికారి ఉస్మాన్ తెలిపారు.